## శబరిమలకు రికార్డు స్థాయిలో భక్తులు..

కేరళ : కేరళ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమల కు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది మండల- మకరవిళక్కు వేడుకలు గత నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో అయ్యప్ప దర్శనానికి కేరళ, తమిళనాడు సహా దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 25 లక్షల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తాజాగా వెల్లడించారు.గతేడాదితో పోలిస్తే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతేడాది ఈ సమయానికి సుమారు 21 లక్షల మంది భక్తులు అయ్యప్ప ఆలయాన్ని సందర్శించారు. ప్రస్తుత సీజన్‌లో ఆ సంఖ్య 25 లక్షలు దాటినట్లు శబరిమల చీఫ్ పోలీస్ కోఆర్డినేటర్ ఎడీజీపీ ఎస్ శ్రీజిత్ తెలిపారు. డిసెంబర్ చివరినాటికి రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా దర్శనాలు సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :251 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 16-12-2025 | పేజీలు:4 వెల: 2.00

## పంచాయితీ ఫలితాలు: రెండో దశలోనూ దూకుడు కంటిన్యూ




హైదరాబాద్,తెలంగాణలో జరుగుతున్న పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం రెండో దశ పూర్తైంది. మొదటి దశలో తన అధిక్యతను స్పష్టంగా ప్రదర్శించిన అధికార కాంగ్రెస్.. రెండో దశలోనూ అదే ఊపును కంటిన్యూ చేసింది. పార్టీ గుర్తులకు భిన్నంగా.. పార్టీ బలపర్చిన అభ్యర్థులు బరిలో నిలవటం తెలిసిందే. రెండో విడతో 85.86 శాతం పోలింగ్ నమోదైంది. తొలిదశతో పోలిస్తే.. రెండో దశ ఫలితాల్లో బీఆర్ఎస్ కొద్దిపాటి సీట్లు ఎక్కువగా లభించాయి.ఉదాహరణకు తొలి విడతలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు 2426 మంది విజయం సాధిస్తే.. బీఆర్ఎస్ 1155 మంది అభ్యర్థులు గెలిచారు. అదే రెండో దశ విషయానికి వస్తే.. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 2331 చోట్ల విజయం సాధిస్తే.. బీఆర్ఎస్ అభ్యర్థులు 1195 మంది గెలుపొందర్నా. బీజేపీ సైతం మొదటి దశలో గెలిచిన వారి కంటే అధికంగా రెండో దశలో గెలవటం గమనార్హం. ఇదే తీరును సీపీఐ.. సీపీఎంలు ప్రదర్శించారు. ఆసక్తికరంగా మొదటి దశతో పోలిస్తే రెండో దశలోనూ ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎక్కువగా విజయం సాధించారు. తొలివిడత మొత్తంగా 4230 స్థానాలకు ఎన్నికలు జరిగితే.. రెండో దశలో 4332 స్థానాలకు ఎన్నికలు జరిగాయి.రెండు దశల ఫలితాల్ని సమగ్రంగా విశ్లేషిస్తే.. కాంగ్రెస్ సగానికి పైగా సీట్లను సొంతం చేసుకోగా.. విపక్ష బీఆర్ఎస్ 25 శాతానికి పైగా సీట్లలో విజయం సాధించారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లోనూ బీఆర్ఎస్ వెనుకబడగా.. ఒక్క సిద్దిపేట జిల్లాలో మాత్రం టాప్ గేరులో ఉండటం గమనార్హం. సిద్దిపేట జిల్లా మాజీ మంత్రి హరీశ్ రావు ప్రాతినిధ్యం వహిస్తుండటం తెలిసిందే. అదే సమయంలో బీఆర్ఎస్ అగ్రనేత అయిన కేటీఆర్ ప్రాతినిధ్యం వహించే సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ తన అధిక్యతను ప్రదర్శించింది.రెండో దశలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర పరిణామంతో పాటు విషాదాలు చోటు చేసుకున్నాయి. ఓట్ల లెక్కింపులో ఉత్కంట పోరు నెలకొన్న తొమ్మిది చోట్ల ఒక్క ఓటు తేడాతో అభ్యర్థులు విజయం సాధించారు. ఓటమిని భరించలేని ఒక అభ్యర్థి గుండెపోటుతో మరణించారు. అదే సమయంలో కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. మెదక్ జిల్లాలోని ఝూన్సీ లింగాపూర్ సర్పంచ్ స్థానానికి తండ్రీ కొడుకులు పోటీ పడగా.. కొడుకు మీద తండ్రి విజయం సాధించారు. తండ్రి కాంగ్రెస్ మద్దతుతో బరిలో దిగగా.. కొడుకు బీజేపీ మద్దతుతో బరిలో దిగారు.మరో ఉదంతంలో అన్నాచెల్లెళ్లు పోటీ చేయగా.. సోదరి మీద అన్న విజయం సాధించాడు. ఈ ఉదంతం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం పరిధిలో చోటు చేసుకుంది. ఇక.. అక్కాచెఅక్క ల్లెళ్లు పోటీ పడిన ఖమ్మం జిల్లా కొంగరలో చెల్లెలు మీద అక్క విజయం సాధించింది. జగిత్యాల జిల్లాలో కోడల మీద మామ విజయం సాధించారు. ఇలా పంచాయితీ ఎన్నికల కుటుంబ పంచాయితీలు పెద్ద ఎత్తున నమోదు కావటం గమనార్హం.

## వాడిపోయిన 'కమలం' పార్టీ..

హైదరాబాద్, పంచాయతీ పోరులో కమలం వాడిపోయింది. తెలంగాణలో 8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపీలు ఉన్న బీజేపీకి పల్లెల్లో పట్టులేదని తేలిపోయింది. గ్రామ పంచాయతీలకు జరిగిన రెండు విడతల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన సీట్లలో కనీసం సగం కూడా సాధించలేక ఘోరపరాభవాన్ని మూటగట్టుకున్నది. తొలి విడతలో దారుణంగా ఓటమిపాలై కేవలం 189 పంచాయతీల్లో గెలుపొందిన బీజేపీకి రెండో విడతలోనూ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండో విడతలో ఎన్నికలు జరిగిన 3,911 స్థానాల్లో కేవలం 236 స్థానాల్లో (6.5 శాతం) మాత్రమే బీజేపీ మద్దతుదారులు విజయం సాధించగలిగారు.ఆదిలాబాద్, మంచిర్యాల మినహా మిగిలిన ఏ జిల్లాలోనూ బీజేపీ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. రెండు విడతల్లో ఆ పార్టీ కేవలం 435 స్థానాలతో సరిపెట్టుకున్నది. రెండు విడతల్లో స్వతంత్ర అభ్యర్థులు 1,161 స్థానాల్లో గెలుపొందారు. అందు లో సగం కూడా బీజేపీకి రాకపోవడం కమలనాథుల దయనీయస్థితికి అద్దంపడుతున్నది. కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గమైన కరీంనగర్‌తోపాటు ఎంపీ ఈటల గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్‌లోనూ బీజేపీ మద్దతుదారులు ఓటమిపాలవడం చర్చనీయాంశమైంది. మరో ఎంపీ రఘునందన్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లో కనీసపోటీ ఇవ్వకపోవడంతో బీజేపీ ఉనికి ప్రశ్నార్థకమైంది.

మాటల్లోనే 'ప్రత్యామ్నాయం'

బీఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రత్యామ్నాయం తామేనని ఊదరగొట్టే బీజేపీ



రాష్ట్ర నేతల మాటలు వట్టివేనని రెండు విడతల పం చాయతీ ఎన్నికల ఫలితాలతో రూఢీ అయిం ది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 30 శాతానికిపైగా ఓట్లు సాధించడం, 8 సీట్లలో గెలుపొందడం గాలివాటమేనని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మున్ముందు తెలంగాణలో ఆ పార్టీ ప్రభావం నామమాత్రమేని పేర్కొంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బలమైన ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమేనని, ప్రజలు కూడా బీఆర్ఎస్ వైపే నిలుస్తున్నారని, అందుకు స్థానిక ఎన్నికల ఫలితాలే నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు.

## పొన్నం,సురేఖ మంత్రి పదవులపై తేల్చేసిన పార్టీ- కేబినెట్ లోకి కొత్తగా..!!

హైదరాబాద్,తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళనకు రంగం సిద్ధం అవుతోంది. ఢిల్లీ కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పంచాయితీ ఎన్నికల తరువాత మంత్రివర్గ ప్రక్షాళన చేయాలని పార్టీ నిర్ణయించింది.అదే విధంగా పెండింగ్ కమిటీలు.. పోస్టుల పైన నిర్ణయం తీసుకున్నారు. ఇక.. గ్రేటర్ ఎన్నికలతో పాటుగా అనర్హత ఎమ్మెల్యేల పైన స్పీకర్ నిర్ణయం తరువాత కొత్త నిర్ణయాలకు పార్టీ సమాయత్తం అవుతోంది. ఈ దిశగా ఢిల్లీ కేంద్రంగా కసరత్తు కొనసాగుతోంది.పంచాయితీ ఎన్నికలు పూర్తయిన తరువాత ప్రభుత్వం.. పార్టీలో కీలక నిర్ణయాల దిశగా కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా పార్టీ కార్యాచరణ గురించి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేసారు. త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉందని తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, సురేఖలను తొలగిస్తారంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఆ ఇద్దరూ బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులని, పార్టీ కోసం కష్టపడినవాళ్లు అని కితాబిచ్చారు.అయితే శాఖలు మారుస్తారా? మంత్రివర్గంలో మార్పులుంటాయా? అన్న విషయాల్లో తనకు స్పష్టతలేదన్నారు. తాను క్యాబినెట్‌లోకి వెళతాననే విషయంలో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తనను మంత్రివర్గంలోకి ఆహ్వానించారని, స్వయంగా కేసీ వేణుగోపాల్ తనతో మాట్లాడారని, తనకు ఆసక్తిలేదని చెప్పానని వివరించారు. పార్టీ కోసం పనిచేయడంలోనే తనకు సంతృప్తి ఉందని మహేష్ గౌడ్ చెప్పారు.కాగా, నెలరోజుల్లోనే వర్కింగ్ ప్రెసిడెంట్లు, కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిటీల నియామకం ఉంటుందని వెల్లడించారు. తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం చివరిదశకు చేరింద న్నారు. ఉప్పల్‌లో మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్



పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, ప్రపంచ దేశాల దృష్టి తెలంగాణ మీద పడుతుందనే ఉద్దేశంతోనే ఈవెంట్‌కు ప్రభుత్వం సహక రించిందని తెలిపారు. నెహ్రూపై పార్లమెంట్‌లో మోదీ వ్యాఖ్యలు సరికాదన్నారు. ప్రియాంక గాంధీ అద్భుతంగా మాట్లాడారని కితాబిచ్చారు.పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలు సమర్థుల ను పక్కనబెట్టి వేరేవాళ్లకు అవకాశం కల్పించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ కారణంగా అభ్యర్థుల ఓట్లు చీలడంతో మూడో స్థానానికి పరిమితం కావాల్సిన బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారన్నారు. సీఎం రేవంత్ విజనరీ లీడర్ అని, ప్రపంచ స్థాయిలో ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. అంచనాలకు మించి గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రాజకీయ ప్రాధాన్యం ఉండొద్దనే మంత్రులను స్టేజీ మీదకు ఆహ్వానించలేదన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ కథ ముగిసిందని వ్యాఖ్యానించారు. హరీశ్, సమయం కోసం వేచి చూస్తున్నారని, వెన్నుపోటు ఖాయమని కీలక వ్యాఖ్యలు చేసారు.

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు.. 500కి చేరిన గాలి నాణ్యత..



న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో అల్లాడుతోంది. గత కొన్ని రోజులుగా రాజధాని నగరంలో కాలుష్యం ప్రమాదకరస్థాయిలో కొనసాగుతోంది. ఇవాళ కూడా గాలి నాణ్యత సూచిక తీవ్రస్థాయిలో నమోదైంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 450 మార్క్‌ను దాటింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. సోమవారం ఉదయం అత్యధికంగా అశోక్ విహార్‌లో ఏక్యూఐ 500గా నమోదైంది. ఆనంద్ విహార్, అక్షర్‌దామ్ ప్రాంతాల్లో ఏక్యూఐ లెవెల్స్ 493గా నమోదయ్యాయి. ద్వారకా ప్రాంతంలో 469, నోయిడాలో 454గా గాలి నాణ్యత సూచిక నమోదైంది.రాత్రి ఉష్ణోగ్రతలు 8.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు ఇవాళ ఉదయం నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో దృశ్యమానత పడిపోయింది. కొన్ని మీటర్ల దూరంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఈ పొగమంచు విమాన, రైలు రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రయాణికులు తమ విమాన స్టేటస్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించింది. దట్టమైన పొగమంచు కారణంగా ఉత్తర భారతంలో రైలు ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. దాదాపు 60 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.

## ఓట్ల దొంగ -గద్దె దిగు.. మోడీకి పెరిగిన సెగ

న్యూఢిల్లీ,ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నుంచి మరింత సెగ పెరిగింది. ఆదివారం సాయంత్రం ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ల దొంగ-గద్దె దిగు కార్యక్రమంలో రాహుల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మైదాన్ మొత్తం పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిండిపోయింది. ఎన్నికల సమయంలో అవకతవకలకు పాల్పడుతూ.. వరుసగా అధికారం చేపడుతున్నారని.. ఓట్ల దొంగ.. అంటూ మోడీపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సహా వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.మోడీ సహా కేంద్ర ఎన్నికల సంఘాన్ని కార్నర్ చేస్తూ.. రాహుల్ గాంధీ సుమారు గంట సేపు పైనే మాట్లాడారు. బీజేపీతో కుమ్మ క్కయిన కేంద్ర ఎన్నికల సంఘం.. ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. కమిషన్‌లోని ప్రతి ఒక్కరూ మోడీకి సాష్టాంగ ప్రణామాలు చేస్తూ.. ఆయన చెప్పినట్టే నటిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో పారదర్శకంగా ఉంటామని చేస్తున్న ప్రమాణాలను కూడా తోసిపుచ్చుతూ.. బీజేపీకి సాగిలపడుతున్నారని ఎద్దేవా చేశారు. సత్యం-అసత్యానికి మధ్య జరుగుతున్న పోరాటంలో బీజేపీ వైపే కేంద్ర ఎన్నికల సంఘం నిలబడడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి కూడా తీరని ద్రోహమని వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికలను ప్రస్తావించిన రాహుల్ గాంధీ.. ఈ ఎన్నికలకు ముందు.. ప్రభుత్వ మే ప్రజల నుంచి ఓట్లను కొనుగోలు చేసిందన్నారు. ఒక్కొక్క మహిళకు 10 వేల రూపాయలు ముట్టజెబుతున్నా.. కేంద్ర ఎన్ని కల సంఘం నిద్ర పోయిందని దుయ్యబట్టారు. ఓట్లను దొంగిలించి గద్దెనెక్కడం బీజేపీకి అలవాటుగా మారిందన్న రాహుల్‌గాంధీ .. సత్యం వైపు తాము నిలబడ్డామని.. మోడీ సర్కారును కూల్చేస్తామని వ్యాఖ్యానించారు. ఇదేసమయంలో రాహుల్ గాంధీ.. రాష్ట్రీ స్వయం సేవక్ సంఘ్‌పైనా తీవ్ర విమర్శలు గుప్పించారు.సత్యానికి



విలువ లేదని ఆర్ ఎస్ ఎస్ భావిస్తోందని.. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రపంచాన్ని, దేశాన్ని శాసించాలని చూస్తోం దని నిప్పులు చెరిగారు. కానీ. అదేసత్యంతో ప్రజల మన్ననలు పొంది.. మోడీ, ఆర్ ఎస్ ఎస్‌లకు తగిన బుద్ధి చెబుతామని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ మాట్లాడుతూ.. దేశంలో ఏం జరుగుతోందో.. ప్రజలు గమనించాలని కోరారు. ఓట్లను చోరీ చేయడం ద్వారా ప్రజల అభీష్టానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి కూడా బీజేపీ తూట్లు పొడుస్తోందన్నారు.ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి దేశంలో దొంగలు పడ్డారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా.. వచ్చే వారం నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఓట్ చోరీ యాత్రలు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో తీర్మానం చేశారు. ఇదిలావుంటే.. సభకు వచ్చిన వారికి 10 పేజీలతో కూడిన రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్యాంగ పుస్తకాలను రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేలు ప్రదర్శించారు.

## హరీష్ రావు వల్ల కాదు...అందుకే కాంగ్రెస్‌లో చేరాను




హైదరాబాద్,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుతో ఉన్న గొడవల వల్లే తాను గతంలో బీఆర్ఎస్‌ను వీడానని కవిత మాట్లాడుతున్న మాటల్లో వాస్తవం లేదని అన్నారు.కవిత చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జగ్గారెడ్డి ఆదివారం రోజున మీడియాతో మాట్లాడుతూ.... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆహ్వానం మేరకే తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. హరీష్ రావుతో విభేదాల కారణంగానే తాను కాంగ్రెస్‌లో చేరానన్న కవిత వాదనలను ఆయన తోసిపుచ్చారు.హరీష్ రావుతో తనకు ఎప్పుడూ రాజకీయ వైరం మాత్రమే ఉంటుందని, ఎలాంటి వ్యక్తిగత శత్రుత్వం లేదని స్పష్టం చేశారు. హరీష్ రావు రాజకీయాలు, నా రాజకీయాలు పూర్తిగా భిన్నమైనవని... తాను కోపంతోనో లేదా ఆయనకు వ్యతిరేకంగానో బీఆర్ఎస్ పార్టీని వీడలేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కావడం వల్లే కవిత రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. తండ్రి చాటు బిడ్డగానే ఆమెకు గుర్తింపు ఉందని విమర్శించారు. కానీ, తాను తన రాజకీయ జీవితాన్ని స్వతంత్రంగా ప్రారంభించానని... తన సొంత బలంపై, ప్రజల మద్దతతో రాజకీయంగా ఎదిగానని తెలిపారు. కవిత కుటుంబ అంతర్గత వివాదాల్లోకి తన పేరును ఎందుకు అనవసరంగా లాగుతున్నారు? అని ఆయన ప్రశ్నించారు.కవిత అభిమాన సంఘాల పేరుతో తనపై సోషల్ మీడియాలో తప్పుడు వీడియోలు పెడుతున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. ఇలాంటి చిల్లర ట్రిక్స్ మానుకోవాలని, ఇప్పటికైనా తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం ఆపేయాలని కోరారు.అప్పట్లో ఎమ్మెల్యేగా ఉండి సంగారెడ్డిలో రెండు మున్సిపాలిటీలను గెలిపించిన తన పనితీరును చూసి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ముగ్ధదయ్యారని... తనను మెచ్చుకొని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారని చెప్పారు. తమ ప్రాంతానికి ఐఐటీ, నాలుగు లేనర్ల జాతీయ రహదారితో సహా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వాగ్దానం చేశారని... అందుకే తాను కాంగ్రెస్‌లో చేరానని జగ్గారెడ్డి వివరించారు.అయితే జిల్లాలో రాజకీయ కక్షలు కొనసాగుతున్నాయని జగ్గారెడ్డి ఆరోపించారు. సంగారెడ్డిలో రాహుల్ గాంధీ సభ విజయవంతమైన తర్వాత తన రాజకీయ పతనానికి హరీష్ తన వంతు ప్రయత్నం చేశారని జగ్గారెడ్డి ఆరోపించారు. ఇతరుల మాదిరిగా కాకుండా తాను ప్రత్యక్ష రాజకీయాలను నమ్ముతానని, ఇటీవల జరిగిన కొన్ని పరిణామా లతో తాను కలత చెందానని... వాటి గురించి మే నెలలో మాట్లాడుతానని ఆయన అన్నారు. ప్రచార కమిటీ చైర్మన్ పదవిపై తనకు ఆసక్తి లేదని కూడా ఆయన స్పష్టం చేశారు.

### ఏపీ లిక్కర్ కేసులో నిందితులకు సుప్రీంకోర్టులో తాత్కాలిక ఊరట

న్యూఢిల్లీ,ఆంధ్రప్రదేశ్ లిక్కర్ కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్పలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇటీవల హైకోర్టు బెయిల్‌ను రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ వారు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.ఈ సందర్భంగా నిందితులకు సుప్రీంకోర్టు తాత్కాలిక ఊరట కల్పించింది. కేసులో సరెండర్ కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ, గతంలో ఇచ్చిన మధ్యంతర ఆదేశాలు కొనసాగుతాయని కోర్టు తెలిపింది.సిట్‌కు 10 రోజుల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కౌంటర్‌కు ప్రతిగా రిజోయిండర్ దాఖలు చేసేందుకు ఐదు రోజుల సమయం ఇవ్వాలని నిందితుల తరపు న్యాయవాదులు కోరగా, ఇప్పటికే రెండు రిజోయిండర్లు దాఖలయ్యాయని, మరోటి ఇవాళ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు.విచారణ సందర్భంగా ఇన్‌కంప్లీట్ చార్జ్‌షీట్ అంశం, స్టాట్యూటరీ

## కేజ్రీవాల్,రేఖా గుప్తా మధ్య మాటల యుద్ధం



న్యూఢిల్లీ,ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరడంతో రాజకీయాలు వేడెక్కాయి. ఆప్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విపశ్యన ధ్యానంపై ఢిల్లీ సీఎం రేఖా గుప్తా చేసిన వ్యంగ్యాస్త్రాలు వివాదానికి దారితీశాయి. తనను విమర్శించడానికి బుద్ధుడు బోధించిన పవిత్రమైన విపశ్యన ధ్యానాన్ని ఎగతాళి చేయడం ముఖ్యమంత్రి స్థాయికి తగదని కేజ్రీవాల్ హితవు పలికారు. గతవారం జరిగిన ఓ కార్యక్రమంలో రేఖా గుప్తా మాట్లాడుతూ.. "మేము ఢిల్లీలోనే ఉంటూ కాలుష్య సమస్యకు పరిష్కారాలు వెతుకుతున్నాం. ఆరు నెలలకోసారి ఢిల్లీని గాలికి వదిలేసి, దగ్గు తగ్గించుకోవడానికి విపశ్యనకు పారిపోయే వాళ్లలాంటి వాళ్లం కాదు" అని కేజ్రీవాల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "మీకు నాపై రాజకీయ శత్రుత్వం ఉండొచ్చు. కానీ, గౌతమ బుద్ధుడు బోధించిన పవిత్రమైన విపశ్యన ధ్యానాన్ని ఈ విధంగా అవహేళన చేయడం మీకు తగదు" అని పేర్కొన్నారు.

## సంపాదకీయం

**మంగళవారం 16-12-2025**

# విద్వేష వ్యాప్తి

స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తమిళనాడులో మతోన్మాద ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు బిజెపి, ఇతర హిందూత్వ మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తుండడం ఆందోళనకరం. మదురై జిల్లాలోని తిరుప్పరన్‌కుండ్రమ్ కొండపై వున్న ఆరాధనా స్థలాల చుట్టూ వివాదాన్ని లేవనెత్తడం దారుణం. ఆ కొండపై మూడు ఆలయాలు, దర్గాతోపాటు అనేక ప్రాచీన జైన గుహలు కూడా వున్నాయి. అనేక శతాబ్దాలుగా, ఈ కొండ మత సామరస్యతకు, శాంతియుత సహజీవనానికి ప్రతీకగా నిలిచింది. వివిధ మత విశ్వాసాలకు చెందిన ప్రజలు పరస్పర గౌరవంతో వారి వారి మతపరమైన ఆచారాలు, పద్ధతులను పాటిస్తూ వచ్చారు. వివిధ కమ్యూనిటీల సభ్యులు ఎలాంటి విద్వేషాలు లేకుండా కలిసి జీవిస్తూ వచ్చారు. అయితే, తమిళనాడులో రాజకీయ లబ్ది పొందే లక్ష్యంతో, బిజెపి నేతలు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ ప్రదేశాన్ని 'దక్షిణాది అయోధ్య'గా ముద్ర వేశారు. అక్కడున్న వాతావరణాన్ని చెడగొట్టేందుకు, అసమ్మతి, విద్వేషాలను మరింత పెంచేలా సోషల్ మీడియాను కూడా ఉపయోగించి దాన్ని మరింత విస్తరింపజేశారు. ఎన్నో శతాబ్దాలుగా సామరస్యంతో జీవిస్తున్న వివిధ మతాల ప్రజల మధ్య చిచ్చుపెట్టడానికే బిజెపి నాయకులు మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ ముందు కేసు దాఖలు చేశారు. ఇప్పుడు ఈ అంశంపై పిటిషన్‌ను విచారిస్తూ గత కోర్టు రూలింగ్స్‌ను, చారిత్రక రికార్డులను, ఆరాధనా స్థలాల చట్టం(1991)ని బెంచ్ విస్మరించడం దురదృష్టకరం. సికిందర్ బాదుషా దర్గాకు పక్కనే బ్రిటిష్ కాలం నాటి సర్వే పిల్లర్‌పైన కార్తీక దీపాన్ని వెలిగించడానికి పిటిషనర్‌ను అనుమతించడం ద్వారా కోర్టు మతోన్మాద శక్తులకు ఒక అవకాశాన్ని కలిగించింది. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ పాలనా యంత్రాంగం అభ్యంతరాలను పక్కనబెట్టిన సింగిల్ జడ్జి బెంచ్, దీని కోసం సిఐఎస్‌ఎఫ్ రక్షణ కోరేందుకు కూడా పిటిషనర్‌ను అనుమతించడం విచారకరం. ఈ చర్యలు, ప్రకటనలన్నీ కూడా గతంలోని తీర్పులను పట్టించుకోకపోవడమే కాక శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని కూడా పక్కనబెట్టడం ద్వారా రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే జస్టిస్ స్వామినాథన్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించాలని ఇండియా వేదిక ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించడం సబబైనది. మతోన్మాద శక్తులు ఏర్పాటు చేసిన నిరసనల్లో చేరేందుకు మదురై, తమిళనాడు ప్రజలు తిరస్కరించడం ద్వారా రాష్ట్ర బహుళ సంప్రదాయాలను పరిరక్షించడం అభినందనీయం. ఈ విద్వేష అంశాన్ని దృఢంగా ఎదుర్కొనడంలో రాష్ట్రంలోని డిఎంకె ప్రభుత్వం తీసుకున్న వైఖరి ప్రశంసనీయం. సిపిఎం నాయకుడు, మదురై ఎంపి ఎస్.వెంకటేశన్‌ను హిందూత్వ గ్రూపులు లక్ష్యంగా చేసుకోవడం, ఆయనను హత్య చేస్తామంటూ బెదిరించడం గర్హనీయం. ఈ అంశాన్ని ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ వివాదంగా మార్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నదనడానికి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తాజా వ్యాఖ్యలే నిదర్శనం. హింసను ప్రేరేపించేలా "హిందువులు మేల్కోవాలంటూ" తీవ్ర వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారహితం. ప్రస్తుతం న్యాయ పరిధిలోవున్న ఈ సమస్యను జాతీయ స్థాయిలో తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందనడం, తిరుప్పరంకుండ్రం అంశాన్ని తీవ్రతరం చేయాల్సివస్తే ఉద్రిక్తతలు, హింస చెలరేగుతాయని హెచ్చరించడం, తమిళనాడులో హిందువులు మేల్కొంటే ఈ సమస్య ఇక్కడే పరిష్కారమవుతుందని మోహన్ భగవత్ రెచ్చగొట్టడం కుట్ర పూరితమైనవి. ఇదిలా వుండగా సనాతన ధర్మం జపం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ఈ విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం విద్వేష వాతావరణాన్ని మరింతగా విస్తరింపజేసే ప్రయత్నమే! ప్రజల జీవనోపాధులపై, రాజ్యాంగ హక్కులపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడుల నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి సంఘ పరివార్ పాల్పడుతున్న ఇటువంటి మతోన్మాద రాజకీయాలను ప్రజాస్వామ్య శక్తులు, లౌకిక భావ సారూప్యత కలిగిన ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలి. భారతీయ సాంప్రదాయమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని పరిరక్షించుకోవాలి.

# ఓట్లు కొనే అభ్యర్థులు వద్దే వద్దు




హైదరాబాద్,ఇటీవల కాలంలో ఎన్నికల్లో వస్తున్న మార్పులను పరిశీలిస్తే... నోటుతో ఓటు పొందడం నిలబడ్డ అభ్యర్థుల సంస్కృతిగా మారితే.. ఓటుతో నోటు పొందడం సామాన్య ప్రజల హక్కుగా మారిపోతుంది. దీంతో అభ్యర్థులు గెలిచిన తరువాత అధికారంతో అవినీతికి వైపు వెళ్తే, ఓటర్లు ప్రలోభాలకు గురై అంధకారంలోకి వెళ్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. చివరికి అభివృద్ధి కూడా శూన్యం అవుతుంది. నిజమైన ప్రజా సేవ చేసే నాయకులు ఎన్నికలకు దూరమవుతున్నారు. ఎన్నికల్లో విచ్చలవిడి డబ్బు, మద్యం ప్రవాహంతో గొప్పగా వర్ధిల్లుతున్న పల్లె సంస్కృతి విధ్వంసం అవుతుంది. స్వార్థ రాజకీ యాలతో ఈర్ష్యా, ద్వేషం, పగ, ప్రతీకారాలు పెచ్చరిల్లుతున్నాయి. నేటికి గ్రామీణ ప్రజల పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం వంటి సమస్యలకు తీరలేదు. దీనికి ప్రధాన కారణం ఓటర్లు నీతి, నిజాయితీలతో ఓటు వేయకపోవడమే. మరోవైపు ప్రలోభ పెట్టే రాజకీయ నాయకులను తిరస్కరించకపోవడం కూడా.స్వాతంత్ర్య అనంతరం భారత దేశంలో పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా స్థానిక స్వపరిపాలన కోసం మూడంచెల 'పంచాయతీ రాజ్ వ్యవస్థ'ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమైన మైలురాయి. మన దేశంలో గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని ఆకాంక్షిస్తూ భారత ప్రభుత్వం 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. దీనికనుగుణంగా తెలంగాణ రాష్ట్రం వచ్చాక రెండవసారి పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. సార్వత్రిక వయోజన ఓటు హక్కును భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయుడికి కల్పించబడింది. ఇది కుల, జాతి, మత,లింగ, భాష వంటి భేదం లేకుండా కల్పించిన సార్వత్రిక సమానత్వ హక్కు. 'ఒక ఓటు ఒక విలువ' అనే సూత్రం ద్వారా ప్రజానిధులను ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం సామాన్యులకే ఇచ్చింది. ఓటనే ఆయుధంతో ప్రజాస్వామ్య విప్లవానికి పునాది వేసిన వ్యక్తి అంబేద్కర్. అణచివేయబడిన వర్గాల గొంతుకకు ప్రాణం పోసి కుల, మత గోడలను బద్దలుగొట్టే ప్రయత్నం చేశారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో ఓటు హక్కు కోసం పోరాటాలు జరిగాయి. భారతదేశంలో మాత్రం అంబేద్కర్ ఒక్కరే పోరాటం చేశాడు. ముఖ్యంగా ఈ దేశంలో మనుషులుగానే గుర్తించని బిసి, ఎస్‌సి, ఎస్‌టి సమాజాన్ని ఓటుతో విలువ లభించింది. నేడు ఆ ఓటు ఒక సరుకుగా, ఎన్నికల వ్యవస్థ ఒక మార్కెట్ గా మారి ఒక ధనస్వామ్య వ్యవస్థకు దారితీయడం జరుగుతుంది. తద్వారా అభివృద్ధి, సంక్షేమం ముసుగులో దోపిడీ రాజ్యమేలుతుంది. అంబేద్కర్ 'నేను నా దేశ ప్రజలకు ఓటు హక్కు అనే ఆయుధాన్ని ఇచ్చాను. అది కత్తి కంటే పదునైంది. దాని సాయంతోనే పోరాడి రాజవుతారో... అమ్ముకుని బానిసలవుతారో తేల్చుకోవాల్సింది వారే' చెప్పారు. ప్రజలంతా భవిష్యత్ పునర్నిర్మాణానికి నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన సందర్భం ఇది.

### ప్రలోభ పెట్టే నాయకుల్ని తిరస్కరిద్దాం

తెలంగాణ రాష్ట్రంలో రెండవసారి గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే మొదటి దశ ఎన్నికలు పూర్తయ్యాయి. ఇప్పుడు రెండవ, మూడవ దశ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పంచాయతీ ఎన్నికల్లో పోటీలో నిలబడిన అభ్యర్థులు ఓటర్లను విపరీతంగా ప్రలోభాలకు గురిచేస్తున్నారు. సామాన్యుల నుంచి బాగా చదువుకున్న విద్యావంతుల సైతం ప్రలోభాలకు గురికావడం ఆందోళన కలిగిస్తుంది. వివిధ కులాల దళారి నాయకులు తమ కులం ఓట్లు మీకేనని అభ్యర్థులకు చెబుతూ డబ్బులు వసూలు చేస్తూ కులాన్ని తాకట్టు పెడుతున్నారు. మరోవైపు దళారుల సహకారంతో అభ్యర్థులు నిత్యం మందు పార్టీలతో ఓటర్లను మత్తులో ముంచుతున్నారు. ఓటుకు వెయ్యి నుంచి ఐదు, పది వేలు పెట్టి ఓట్లు కొంటున్నారు. ఓటు ఒక వేలం పాటగా మారిపోయింది. అమాయక దళిత, బహుజనుల్ని ఓటు మార్కెట్‌లో బలి చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఎన్నికల్లో వస్తున్న మార్పులను పరిశీలిస్తే... నోటుతో ఓటు పొందడం నిలబడ్డ అభ్యర్థుల సంస్కృతిగా మారితే.. ఓటుతో నోటు పొందడం సామాన్య ప్రజల హక్కుగా మారిపోతుంది. దీంతో అభ్యర్థులు గెలిచిన తరువాత అధికారంతో అవినీతికి వైపు వెళ్తే, ఓటర్లు ప్రలోభాలకు గురై అంధకారంలోకి వెళ్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. చివరికి అభివృద్ధి కూడా శూన్యం అవుతుంది. నిజమైన ప్రజా సేవ చేసే నాయకులు ఎన్నికలకు దూరమవుతున్నారు. ఎన్నికల్లో విచ్చలవిడి డబ్బు, మద్యం ప్రవాహంతో గొప్పగా వర్ధిల్లుతున్న పల్లె సంస్కృతి విధ్వంసం అవుతుంది. స్వార్థ రాజకీయాలతో ఈర్ష్యా, ద్వేషం, పగ, ప్రతీకారాలు పెచ్చరిల్లుతున్నాయి. నేటికి గ్రామీణ ప్రజల పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం వంటి సమస్యలకు తీరలేదు. దీనికి ప్రధాన కారణం ఓటర్లు నీతి, నిజాయితీలతో ఓటు వేయకపోవడమే. మరోవైపు ప్రలోభ పెట్టే రాజకీయ నాయకులను తిరస్కరించకపోవడం కూడా. ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనేది ప్రజలు ప్రతి వస్తువుపై కట్టే పన్నుల డబ్బుల ద్వారా జరుగుతుంది. ఇది ఏ పార్టీ, ఏ రాజకీయ నాయకులు సొమ్ము కాదు. దీన్ని ఓటర్లు గుర్తెరగాలి. ఎన్నికలు ప్రతీ ఐదేళ్లకోసారి వస్తుంటాయి. ఈ ఐదు సంవత్సరాల కాలానికి అభ్యర్థులిచ్చే డబ్బు, మందు రోజుకు ఒక రూపాయి విలువ కూడా కాదు. కావున ఓటర్లు యాచకులుగా మారవద్దు. మన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టవద్దు. అసలు ప్రలోభ పెట్టే నాయకుడు ఎప్పటికీ ప్రజానేత కాదు. కావున మందు, డబ్బుతో ప్రలోభాలకు గురిచేసే నాయకులను తిరస్కరిద్దాం. ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగమై నిజాయితీగా ఓటేసి గ్రామాభివృద్ధికి పాటుపడదాం.

# చట్టసభల్లో చర్చలు పెడదారి



హైదరాబాద్,వందేమాతరం ఒక పదం. అది ఒక అక్షర సముదాయం మాత్రమే కాదు. అది ఒక నాటి తరాన్ని నిరంతరం నిద్రలేపి ఉద్యమాలలోకి ఉరికించిన అక్షర నినాదం. భారత స్వాతంత్ర్య సమరంలో వందేమాతరం అనే అక్షరాలు కోట్లాది భారతీయులను ఉత్తేజపరిచిన ఆయుధాలు. ఆ అక్షరాల అంకురార్పణకు సరిగ్గా 150 ఏళ్లు నిండాయి. ఇది భాతీయులందరికీ ఒక అద్భుతమైన సందర్భం. అప్పటి ఉద్యమాల జ్ఞాపకాలను నెమరువేసుకొని భవిష్యత్ తరాలకు దాని స్ఫూర్తిని అందించే కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి.అందుకు తగ్గట్టుగానే ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంటు సమావేశాల్లో వందేమాతరంపై చర్చసాగింది. సందర్భం సరైనదే కాని పార్లమెంటుకు ప్రత్యేకించి లోక్‌సభ నాయకుడుగా భారత ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ ఉద్దేశం మాత్రం దారితప్పింది. వందేమాతరం సంపూర్ణ సారాంశాన్ని కాకుండా కొందరి ప్రయోజనాలకోసం అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పంక్తులను కుదించారని, ఇది దేశ ద్రోహమని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శలను గుప్పించారు. ఇది ప్రతి విమర్శలకు, చర్చోపచర్చలకు దారితీసింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సభ్యులు ఎదురు దాడి చేశారు. భారత స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించింది, వందేమాతరం గీతాన్ని సమర నినాదంగా మార్చింది కాంగ్రెస్ మాత్రమేనని జవాబు విసిరారు. ఇప్పటి భారతీయ జనతా పార్టీ మాతృ సంస్థ భారతీయ జనసంఘ్, దాని పితృ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి ఊడిగం చేశారని, స్వాతంత్ర్య సమరంలో ఆ శక్తులు ఎప్పుడూ భాగస్వాములు కాలేదని, కాంగ్రెస్ బిజెపిపై ధ్వజమెత్తింది. అయితే ఈ చర్చ పార్లమెంటుకు మాత్రమే పరిమితం కాలేదు. బయటి కూడా దాని ప్రతిస్పందనలు వినవస్తున్నాయి. కొంత కాలం వేరే విషయాలమీద చర్చ ఉండదు. కేవలం ఈ విషయం మీదనే చర్చ సాగుతుంది. ఇది ఏదో యథాలాపంగా నరేంద్ర మోడీ లేవనెత్తలేదు. దీని వల్ల నరేంద్ర మోడీ కొన్ని ప్రయోజనాలను ఆశిస్తున్నారు.ఇప్పటి తరంలో నెహ్రూను దేశద్రోహిగా నిలబెట్టాలనేది, దీని వల్ల కాంగ్రెస్‌ను కూడా దోషిగా చూపించాలనే ఉద్దేశం. రెండోది పార్లమెంటు జరుగుతున్న సందర్భంలో కొన్ని ముఖ్యమైన విషయాలు చర్చించాలి. అవి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ఉండొచ్చు. అందువల్ల ఈ వివాదాన్ని ముందుకు తెస్తే, ఈ సమావేశాలు మొత్తం దీని మీదనే నడిపించొచ్చు. అవసరమైన బిల్లులను గుట్టుచప్పుడు కాకుండా ఆమోదింప జేసుకోవచ్చు. ఇది పాలకవర్గాలలో ఉండే లక్షణం. దీనినే నరేంద్ర మోడీ తన ఎత్తుగడగా భావించారు. దీనిని కాంగ్రెస్ పార్టీ అర్థం చేసుకొని వ్యవహరించాలి. వందేమాతరం మీద చర్చను పక్కనపెట్టి ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద చర్చించాలి. ఇదే విషయాన్ని కాంగ్రెస్ లోక్‌సభ సభ్యురాలు ప్రియాంకా గాంధీ సరిగ్గానే వ్యక్తపరిచారు. వందేమాతరం మీద చర్చను పక్క పెట్టి ప్రజల అత్యవసర సమస్యలైన అధిక ధరలు, నిరుద్యోగం, పేదరికం లాంటి సమస్యలపై చర్చించాలని సభలో ప్రస్తావించారు. ఇక్కడే పౌరసమాజం కూడా స్పందించాలి. పార్లమెంటు సమావేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు, దాని ప్రభుత్వ సమాధానాలు, పరిష్కారాలు, భవిష్యత్తు కార్యాచరణ గురించి మాట్లాడాలి. అయితే గత కొంత కాలంగా ఏదో ఒక వివాదాన్ని లేవనెత్తడం, దాని గురించి చాలా తీవ్రంగా మాట్లాడుకోవడం, వాకౌట్‌లు, సస్పెండ్‌లు, సమావేశాలు ముగియడం. ఇది రివాజు. ప్రభుత్వం తన ధోరణిలో తాను పని చేసుకుంటూ వెళ్లడం జరుగుతుందే కాని నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ప్రస్తావన ఉండడంలేదు. ఇది చాలా శోచనీయం. ఇది ఎంత మాత్రం వాంఛనీయం కాదు.ప్రస్తుతం ప్రజలు చాలా ఆనందంగా ఉన్నట్లు ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. ఇందులో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ఎవరూ దీనికి అతీతులు కాదు. ముఖ్యంగా కేంద్రం సంపూర్ణంగా ప్రజల సామాజిక, ఆర్థిక సమస్యలను విస్మరించింది.ముఖ్యంగా దేశంలోని నూటికి 80 శాతం మందికి పైగా ప్రజలు సామాజిక, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇందులో అందరినీ పట్టిపీడించేది అధిక ధరలు. గత పదేళ్లలో ధరలు ఏ స్థాయిలో పెరిగాయో చెప్పడానికి వీలు లేదు. నేను పేర్కొంటున్న ధరలు జాతీయ స్థాయి గణాంకాల నుంచి తీసుకున్నవి. ఇందులో మన రాష్ట్రానికి కొద్దిగా అటుఇటుగా తేడాలు ఉండవచ్చు. కాని పెరుగుదల మాత్రం సత్యం. నిత్యావసర వస్తువులు అందులో ముఖ్యంగా ఆహార వస్తువుల ధరలను పరిశీలిస్తే ఎంత తీవ్రంగా పెరిగాయో మనం అర్థం చేసుకోవచ్చు. 2014 సంవత్సరంలో కంది పప్పు 70 రూపాయలు ఉంటే 2025 వచ్చేసరికి 150 రూపాయలకు పెరిగింది. మినపప్పు 64 నుంచి 123 రూపాయలు కూడా దాటింది. శెనగ పప్పు 47 రూపాయల నుంచి 88 రూపాయలు చేరుకున్నది. అట్లాగే ఉల్లిగడ్డ, టమాట, బంగాళా దుంపలు 50 శాతం నుంచి 60 శాతం వరకు పెరిగాయి. వంట నూనెల ధరలు 3 రెట్లు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలు ఎంత పెరిగాయో ప్రత్యక్షంగా మనం రోజూ చూస్తూనే ఉన్నాం.ఇది ప్రతి భారతీయుడిపై పడుతున్న భారం. అయితే ఇదే స్థాయిలో కార్మికుల, ఉద్యోగుల వేతనాలు పెరగలేదు. ఒక సాధారణ ఉద్యోగి ప్రైవేటు రంగంలో 2014 రూ. 20 వేలు జీతం పొందితే, నేడు ఆ ఉద్యోగి రూ. 30 వేలు మాత్రమే అందుకుంటున్నాడు. అంటే 50 శాతం మాత్రమే పెరుగుదల కనిపిస్తున్నది.ఇది ఉద్యోగ భద్రత కలిగిన కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి. హైదరాబాద్ లాంటి నగరాల్లో ఇందులో 30 నుంచి 40 శాతం ఇంటి అద్దెలకే పోతాయి. ఇద్దరు పిల్లలుంటే ప్రతి నెల మరో 30 శాతం వాళ్ల చదువులకు చెల్లించాలి. మిగిలిన 40 శాతం డబ్బులో తన రోజువారీ ప్రయాణ ఖర్చులు, ఇంట్లో అవసరమైన వైద్యం, మందుల ఖర్చులు. ఇవన్నీ పోను ఇంటి నిత్యావసర వస్తువులను ఎట్లా కొనుగోలు చేస్తాడనేది పెద్ద ప్రశ్న. అందుకే నూటికి 60 నుంచి 70 శాతం మంది ప్రతి రోజు ఒక నరకంలో జీవిస్తున్నారు. డిగ్రీలు, పిజిలు చదివి ప్రైవేటు విద్యాలయాల్లో, కంపెనీల్లో పని చేస్తున్న వందలాది మంది ప్రతి నెల అప్పుల ఊబిలో ఇరుక్కుపోతున్నారు. కొంత మంది రెగ్యులర్ ఉద్యోగంతో పాటు, ఇతర చిన్నచితక ఉపాధిని వెతుకుంటున్నారు. స్విగ్గి, జొమాటో లాంటి సర్వీసులలో కూడా చేస్తున్నారు. రాపిడో ద్వారా బైకులు నడుపుకుంటున్నారు.ఇవి కదా పార్లమెంటులో చర్చిచాల్సింది. దానికి కదా తమ సమయాన్ని వెచ్చించి పరిష్కారాలను ఆలోచించాల్సింది. దీనితో పాటు మరొక ముఖ్యమైన సమస్య నిరుద్యోగం. ఈ సమస్యకు పరిష్కారం చాలా అత్యవసరం. దేశంలోని కోట్లాది మంది నిరుద్యోగంతో సతమతమవుతున్నారు. మన హేతు విరుద్ధమైన చదువుల వల్ల ఇందులో చాలా మందికి వృత్తి నైపుణ్యం లేదు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక,

# వసూళ్లు మానుకోండి

హైదరాబాద్, ట్రాన్స్‌జెండర్ల బెదిరింపు వసూళ్లపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. ఇకపై బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారికి కఠిన హెచ్చరికలు జారీ చేశారు .ప్రభుత్వ అవకాశాలను వాడుకుని ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. గ్రూపు తగాదాలు, ఆధిపత్య పోరు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. వారి సమస్యల పరిష్కారానికి 'ప్రైడ్ ప్లేస్' ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ మధ్య కాలంలో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలకు సంబంధించిన వార్తలు నిత్యం వెలుగు చూస్తూనే ఉన్నాయి. వేడుక జరిగితే చాలు.. అది చిన్నది, పెద్దది అనే తేడా లేకుండా.. గుంపులుగా అక్కడకు చేరి బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలో కొందరు నెటిజనులు ఈ సమస్యను సీపీ సజ్జనార్ ద ృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో తాజాగా సజ్జనార్ ట్రాన్స్‌జెండర్లకు వార్నింగ్ ఇచ్చారు. ఇక మీదట వారు బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.తాజాగా అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో సుమారు 250 మంది ట్రాన్స్‌జెండర్లతో సమావేశం నిర్వహించారు. సీపీ సజ్జనార్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలవంతపు వసూళ్లకు పాల్పడితే ట్రాన్స్‌జెండర్ల మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.. వాటిని వినియోగించుకుని.. గౌరవప్రదంగా జీవనం సాగించాలని సూచించారు. తమ చేష్టలతో సామాన్యులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. సీఐడీ, మహిళా భద్రతా విభాగ అడిషనల్ ఏడీజీ చారు సిన్హా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సజ్జనార్ మాట్లాడుతూ.. గత కొంతకాలంగా ట్రాన్స్‌జెండర్ల మధ్య గ్రూపు తగాదాలు పెరుగుతున్నాయని.. వారి మధ్య రాజుకుంటున్న ఆధిపత్య పోరు.. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాక, ప్రాణ నష్టానికి కూడా దారితీస్తున్నాయని సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ట్రాన్స్‌జెండర్ల మీద.. ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.మరీ ముఖ్యంగా వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో ట్రాన్స్‌జెండర్లు గుంపుగా ఇళ్లపైకి వెళ్లి జనాలను ఇబ్బంది పెట్టడమే కాక.. వారి వద్ద నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇకపై ట్రాన్స్‌జెండర్లు ఇలాంటి చర్యలకు పాల్పడితే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.అనంతరం ఏడీజీ చారు సిన్హా మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను పరిష్కరించడానికి గాను మహిళా భద్రతా విభాగంలో 'ప్రైడ్ ప్లేస్' అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, వారిని ఎవరైనా వేధింపులకు గురిచేసినా.. వెంటనే ఈ వింగ్‌ను సంప్రదించవచ్చని చారు సిన్హా తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి మహిళా భద్రతా విభాగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

## చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్

న్యూఢిల్లీ,గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తున్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. అందులో భారతీయులతోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు చెందిన 18 మంది సిబ్బంది ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన జరిగింది. 60 లక్షల లీటర్ల చమురును అక్రమంగా తరలిస్తున్నారని, అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారని ఇరాన్ మీడియా వెల్లడించింది. గల్ఫ్‌లో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటున్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది. చమురు ఎగుమతి చేస్తోన్న దేశాల్లో ఒకటైన ఇరాన్‌లో చమురు ధరలు అతి తక్కువగా ఉంటాయి. అందుకే ఇక్కడినుంచి ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసి, కొందరు భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ కార్యకలాపాలను ఇరాన్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటోంది. కాగా వెనెజువెలా తీరంలో రెండు రోజుల క్రితం అమెరికా ఒక ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసింది. నౌక కెప్టెన్ వెనెజువెలా, ఇరాన్‌ల నుంచి అక్రమంగా చమురు రవాణా చేస్తున్నాడన్న ఆరోపణలతో ఈ నౌకను అగ్రరాజ్యం అడ్డుకుంది. వెనెజువెలా తీరం నుంచి క్యూబాకు బయలుదేరిన ఈ భారీ నౌకను అమెరికా సైనికులు తమ అధీనంలోకి తీసుకున్నారు. హెలికాప్టర్?లో వెళ్లి షిప్?పై దిగారు. ఆయుధాలతో షిప్ సిబ్బందిని చుట్టుముట్టిన వీడియోను అమెరికా మీడియాకు విడుదల చేసింది. ఇప్పటి వరకు సీజ్ చేసిన వాటిలో ఇదే అతిపెద్ద ఆయిల్ ట్యాంకర్ డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇకముందు కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతాయని అన్నారు. అది జరిగిన రెండు రోజులకే ఇరాన్ ఈ నౌకను సీజ్ చేసింది. ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హర్మూజ్ జలసంధి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20 శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం-ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళ్తుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్‌ఎన్‌జీ) రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్‌ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

## కోల్‌కతాలో మెస్సీకి 70 అడుగుల విగ్రహం

కోల్‌కతా,అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి గోట్ టూర్ ఆఫ్ ఇండియా ప్రారంభమైంది. కోల్‌కతాలో శనివారం ఉదయం లేక్‌టౌన్‌లో తన 70 అడుగుల విగ్రహాన్ని బాలీవుడ్ నటుడు షారుక్‌ఖాన్‌తో కలిసి మెస్సి వర్చువల్‌గా ఆవిష్కరించాడు. భద్రతా కారణాల రీత్యా అక్కడికి వెళ్లలేదు.తర్వాత సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో టీమ్ఇండియా మాజీ కెప్టెన్ గంగూలీ, బంగాల్ సీఎం మమత బెనర్జీలను కలువనున్నాడు. ఆ తర్వాత హైదరాబాద్ బయలుదేరతాడు. తెల్లవారుజామున కోల్‌కతాకు చేరుకున్న మెస్సి వెంట ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డిపాల్, లూయిస్ సువారెజ్ కూడా ఉన్నారు. 14ఏళ్ల తర్వాత భారత్‌కు వచ్చిన మెస్సిని చూడటానికి అభిమానులు వందల సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు. అర్జెంటీనా జెండాలను పట్టుకొని మెస్సి, మెస్సి అంటూ నినాదాలు చేస్తూ ఘనస్వాగతం పలికారు.

## చాంద్రాయణగుట్టలో దారుణం

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలోని చాంద్రాయణగుట్టలో దారుణం చోటుచేసుకుంది. పక్కింటి పిల్లలతో తరచూ గొడవ పడుతున్నాడనే కోపంతో పదేళ్ల బాలుడిని సవతి తండ్రి కిరాతకంగా హత్య చేశాడు. బాలుడి తలను రోడ్డుకేసి బాదడంతో తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన ఓ మహిళకు గతంలో వివాహమైంది. భర్తతో విభేదాల కారణంగా విడాకులు తీసుకుని, అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. ఆమె మొదటి భర్త కుమారుడైన షేక్ మహ్మద్ అజహర్ (10) కూడా వారితోనే ఉంటున్నాడు. అయితే, అజహర్ తరచూ ఇరుగుపొరుగు పిల్లలతో గొడవ పడేవాడు.

## పోలీసుల మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, న్యూఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్ పోలీసులు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి జనవరి 1 వరకు జరిగే వేడుకలపై ఆంక్షలు విధించారు.. వేడుకల కోసం 3 స్టార్ హోటళు ,, క్లబ్బులు, పబ్‌లు ముందుగానే అనుమతి తీసుకోవలని పోలీసులు తెలిపారు. వేడుకల నిర్వహణలో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది, ట్రాఫిక్ నియంత్రణ తప్పనిసరి అని వెల్లడించారు.. పోలీసులు ప్రకటన ప్రకారం.. రాత్రి 10 గంటల తర్వాత అవుట్‌డోర్ సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదు.. ఇండోర్ కార్యక్రమాలు మాత్రమే రాత్రి 1 గంట వరకు నిర్వహించవచ్చు? మైనర్లకు ప్రవేశం నిషేధము.. డ్రగ్స్, అశ్లీల కార్యక్రమాల్కు ÷ర్వర్బ్‌కు పూర్తిగా నిషేధం విధిస్తున్నారు.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు.. న్యూ ఇయర్ వేడుకలు సురక్షితంగా, క్రమబద్ధంగా జరగాలి.. నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకారించాలని పేర్కొన్నారు.

## మహిళా సంఘం సభ్యులకు చేరిన నోటు

రాజన్నసిరిసిల్ల, వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని పొదుపు మహిళా సంఘాల్లో నకిలీ నోటు కలకలం సృష్టించింది. బ్యాంకు నుంచి వడ్డీ లేని రుణాలు పొందిన మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను ప్రతి నెల చెల్లించాల్సి ఉంటుంది. అయితే నగదు చెల్లించే క్రమంలో సభ్యుల నుంచి వస్తున్న 500 రూపాయల నోట్ల వ్యవహారం ప్రస్తుతం మహిళా సంఘాల ప్రతినిధులకు భయాందోళన గురిచేస్తోంది. వేములవాడ పట్టణంలోని ఓ మహిళా పొదుపు సంఘానికి చెందిన సభ్యులు సంబంధిత టీం లీడర్ కు నగదు అప్పగించారు. సంఘం సభ్యుల నుంచి అందిన మొత్తం నగదును శుక్రవారం బ్యాంకు వద్దకు వెళ్లి ఖాతాలో జమ చేసేందుకు వెళ్లగా నకిలీ నోటు వ్యవహారం వెలుగు చూసింది. అయితే 500 రూపాయల నకిలీ నోట్ రావడంతో ఒక్కసారిగా సభ్యురాలు ఆందోళన గురైంది. గతంలోనూ ఇప్పటికే రెండుసార్లు నకిలీ నోటు రాగా తనకు మూడోసారి కూడా అదే నకిలీ నోట్ రావడంతో సభ్యురాలు సభ్యుల నుంచి నగదు సేకరించేందుకు భయాందోళన గురవుతున్నారు. ఇకపై ప్రతినెలా చెల్లించాల్సిన నగదును నేరుగా ఒకరోజు మాత్రమే ఇవ్వాలని అది కూడా, బ్యాంకు సమయం ఉన్నప్పుడే ఇవ్వాలని సంఘంలోని మహిళలకు సూచించినట్టు తెలిసింది. వేములవాడ పట్టణంలోని మహిళా పొదుపు సంఘాలలో నకిలీ నోట్ల వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది.

## సమస్యలు పక్కన పెట్టి మెస్సీతో ఆటలా?

హనుమకొండ,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈవెంట్ మేనేజర్‌లా వ్యవహరిస్తున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ప్రజా సమస్యలు పక్కన పెట్టి మెస్సితో ఫుట్‌బాల్ ఆడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిలో క్వార్టర్లు బాగు చేయడానికి, సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేవు. కానీ సింగరేణి డబ్బులు రూ.100 కోట్లు పెట్టి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతున్నారు. పేదల ఇళ్లను కూలుస్తున్న హైడ్రా.. పెద్దల కబ్జాను పట్టించుకోవడం లేదు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. ఈ ఎన్నికలంటేనే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ 50 శాతం కూడా గెలవలేదు. గెలిచిన వారిని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రజలకు ఆ పార్టీ పట్ల ఎంత విముఖత ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవాలని ఈటల రాజేందర్ అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పీఆర్వో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను బీజేపీ ఎంపీనని... తాను కూడా కొన్ని పోస్టులను చూశానని ప్రస్తావించారు. అవగాహన లేకుండా కొంతమంది తనపై కుట్ర పూరితంగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. అయితే వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. అవగాహన ఉన్నవారు అలా పోస్టులు పెడతారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తాను ఏ పార్టీలో ఉండాలో ప్రజలు తేల్చుకుంటారని చెప్పుకొచ్చారు. ఈ అంశాలను బీజేపీ హై కమాండ్ తేలుస్తుందని.. సమయమే ఇది డిసైడ్ చేస్తుందని వ్యాఖ్యానించారు. తనపై ఎవరు ఏమి చేస్తున్నారు.. ఎవరేం చెబుతున్నారో ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. సందర్భం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతానని అన్నారు. రెండు, మూడో విడత పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యాక ఇటీవల జరిగిన పరిణామాలన్నీ తాను చెబుతానని ఈటల రాజేందర్ పేర్కొన్నారు

## ఫోన్ ట్యాపింగ్, హార్డ్ డిస్కుల ధ్వంసంపై విచారణ

హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ కేసులోఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సిట్ ముందు లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు అధికారి ఏసీపీ వెంకటగిరి ముందు ప్రభాకర్‌రావు సరెండర్ అయ్యారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ప్రభాకర్ రావును సిట్ అధికారులు ఆరు సార్లు విచారణ జరిపిన విషయం తెలిసిందే. అయితే సిట్ విచారణకు ప్రభాకర్ సహకరించకపోవడంతో కస్టోడియల్ విచారణకు ఇవ్వాలని సుప్రీంకోర్టును ప్రభుత్వం ఆశ్రయించింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణకు సుప్రీం ధర్మాసనం అనుమతి ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సిట్ ముందు సరెండర్ అయ్యారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ప్రభాకర్ రావు విచారణ కొనసాగుతోంది. ఏడాది మే 29 నుంచి ఇప్పటి వరకు సుప్రీం కోర్టు కల్పించిన మధ్యంతర రక్షణలోనే ప్రభాకర్ రావు ఉన్నారు. మధ్యంతర రక్షణలోనే అరెస్ట్ కాకుండా ఆరు సార్లు విచారణకు వచ్చారు ప్రభాకర్. అయితే ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వం కీలక అఫిడవిట్‌ను దాఖలు చేసింది. మధ్యంతర రక్షణ కల్పించడంతో కేసు విచారణకు ప్రభాకర్ రావు సహకరించడం లేదని కస్టోడియల్ విచారణకు అనుమతి ఇవ్వాలని, ఈ విచారణ జరిగితే తప్ప ప్రభాకర్ నుంచి ఆధారాలు రాబట్టలేమని సుప్రీం కోర్టులో ప్రభుత్వం వాదనలు వినిపించింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు విన్న ఉన్నతన్యాయస్థానం.. ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణకు అనుమతి ఇవ్వడంతో ఆయన లొంగిపోయారు. ఈరోజు ప్రభాకర్ రావు అరెస్ట్ చూపిన తర్వాత ఏడు రోజుల కస్టోడియల్ విచారణ కొనసాగనుంది. కస్టోడియల్ విచారణ రిపోర్టును సుప్రీం కోర్టుకు సిట్ సమర్పించ నుంది.

## హిట్ అండ్ రన్ కేసులో బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ,ముంబయిలో గతేడాది చోటుచేసుకున్న హిట్-అండ్-రన్ కేసు లో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ.. నిందితుడు మిహిర్ షా వేసిన పిటిషన్‌పై దర్యాప్తునకు నిరాకరించింది. ఇలాంటి అబ్బాయిలకు తగిన గుణపాఠం నేర్పించాల్సిందేనని వ్యాఖ్యానించింది. హిట్-అండ్-రన్ కేసులో బైక్‌పై వస్తోన్న వారిని అతివేగంగా తన కారుతో ఢీకొట్టడమే కాకుండా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. చేసిన నేరానికి గానూ అతడు కొద్ది రోజుల పాటు జైల్లోనే ఉండాలని ఆదేశించింది. గతేడాది ముంబయి లోని వర్లీ ప్రాంతంలో శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా మద్యం మత్తులో బీఎండబ్ల్యూ కారును వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు.

# ఇకపై ఎవరి భద్రత వారిదే!



అమెరికా,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన సరికొత్త 'జాతీయ భద్రతా వ్యూహం' డాక్యుమెంట్‌పై ప్రపంచమంతటా చాలా ఆసక్తిని రేకెత్తించింది. ప్రత్యేకంగా యూరప్‌తో పాటు, అమెరికాకు సంప్రదాయికంగా సన్నిహితమైన ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, జపాన్, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా వంటి సుదూర దేశాలలోనైతే పెద్ద కలకలాన్ని సృష్టించింది. అమెరికా మద్దతుపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న తైవాన్‌ను భయపెట్టింది. ఈ ప్రభావాలను గమనించి కూడా ట్రంప్ తన డాక్యుమెంట్‌లో చెప్పిన వైఖరిని మార్చుకోకపోగా, ఇతర దేశాల పరిస్థితి, భవిష్యత్తు ఏ విధంగా ఉన్నప్పటికీ, తమ భవిష్యత్తు కోసం ఈ కొత్త వైఖరి తప్పనిసరి అని స్పష్టం చేస్తున్నారు.ఇంతకూ ఆ డాక్యుమెంట్‌లో ఏమున్నది? దాని ప్రభావాలు ఈ విధంగా ఎందుకున్నాయి? అనే ప్రశ్నలను చర్చించే ముందు కొన్ని మౌలికమైన విషయాలను చెప్పుకోవాలి. అమెరికా, యూరప్, ఇతర దేశాలతో కూడిన పాశ్చాత్య కూటమి, నాటో సైనిక కూటమి పరిస్థితి ఒకప్పటి వలే లేదు. అవి ఆర్థికంగా, సైనికంగా, రాజకీయంగా సుమారు 2010 వరకు మొత్తం ప్రపంచంపై తమ ఆధిపత్యాన్ని సాగించాయి. ముఖ్యంగా 1991లో సోవియెట్ యూనియన్, దానితోపాటు వార్సా సైనిక కూటమి పతనంతో వారికి ఎదురు లేకుండా పోయింది. అది, అంతకు ముందటి ద్విధ్రువ (అమెరికా, సోవియెట్ యూనియన్ రెండు ధ్రువాలుగా) ప్రపంచానికి బదులు కేవలం అమెరికా నాయకత్వాన ఏక ధ్రువ ప్రపంచంగా పరిణమించిన కాలం. కాని సుమారు 2010 వచ్చే సరికి ఆ దశ మారటం మొదలైంది. వ్లాదిమిర్ పుతిన్ బలమైన నాయకత్వంతో రష్యా తిరిగి పుంజుకోవటం మొదలైంది. మరొక వైపు చైనా కొత్త శక్తిగా ఆవిర్భవించింది. ఆ విధంగా మరొక దశాబ్దం గడిచే నాటికి, రష్యా, చైనాలు ఆర్థికంగా, సైనికంగా కూడా అమెరికా కూటమికి సవాలుగా మారసాగాయి. అమెరికాకు గల బలాలలో శాస్త్ర సాంకేతిక రంగం కూడా ముఖ్యమైనది కాగా, రష్యా కాకపోయినా చైనా అత్యాధునికమైన పరిశోధనలు, ఆవిష్కరణలతో అమెరికాకు సాటిగా ఎదగటమే గాక, కొన్ని రంగాలలో అంతకుమించి పోయింది.ఒకవైపు ఇది జరుగుతుండగా, మరొక వైపు ప్రపంచ వ్యాప్తంగా మరొక విధమైన పరిణామాలు చోటు చేసుకోసాగాయి. అవి బహుళ ధ్రువ ప్రపంచ ధోరణులు. ఇండియా, ఆసియాన్ కూటమి, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, నైజీరియా, కొన్ని అరబ్ దేశాల వంటివి స్వయంగా బలపడుతూ, ఏ కూటమితో నిమిత్తం లేకుండా, స్వతంత్రంగా నిలబడి తమ ప్రయోజనాల కోసం ప్రయత్నిచటం మొదలు పెట్టాయి. అమెరికా కూటమికి ప్రత్యామ్నాయంగా రష్యా, చైనాలు తమకు చేయూత అందిస్తుండటంతో వారి ధైర్యం మరింత పెరగసాగింది. దానితో, అమెరికా ఆదేశాలను గతంలో వలే శిరసావహించే దశ తప్పిపో సాగింది. ఇటువంటి కొత్త పరిస్థితుల మధ్య బహుళ ధ్రువ ప్రపంచం అనే మాట విస్తరించసాగింది. ఈ మార్పుల ఫలితమే బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ వంటివి. అదే పద్ధతిలో ఐక్యరాజ్య సమితిని, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థలను అమెరికా నియంత్రణ నుంచి విముక్తం చేసి ఇతర దేశాలకు సమాన భాగస్వామ్యం, హక్కులు కల్పించాలనే వాదనలు పెరుగుతుండటం.ఈ నేపథ్యాన్ని అంతా ఇంతగా వివరించటం ఎందుకంటే, ఈ పరిణామాలు సృష్టించుతున్న ఒత్తిడుల ప్రభావం వల్లనే అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు తమ జాతీయ భద్రతా వ్యూహాన్ని మార్చుకోక తప్పటం లేదు. అది ఇపుడీ డాక్యుమెంట్ రూపంలో ముందుకు వచ్చినా, వాస్తవానికి ఇంతకు ముందే అందుకు ఆరంభం ట్రంప్ ఇచ్చిన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా) నినాద రూపంలో కనిపించింది. అందుకు ఈ డాక్యుమెంట్ కొనసాగింపని స్వయంగా ట్రంప్ బృందం చెప్తున్నదే. వారు బహిరంగంగా ఒప్పుకోని విషయం, పైన పేర్కొన్న పరిణామాల ఒత్తిడి. అసలు ఆ నినాదమే చెప్తున్నదేమిటి? అమెరికా ఒకప్పుడు 'గొప్పగా ఉండేది. ఆ గొప్పతనాన్ని ఇపుడు కోల్పోయింది. ఆ స్థితిని 'తిరిగి' సాధించాలని. ఆ 'గొప్పతనం' అంటే ఏమిటి? దానిని కోల్పోవటం ఎందువల్ల జరిగింది? తిరిగి సాధించటం ఏ విధంగా? ఈ విషయాలను మాత్రం వారు దాపరికం లేకుండా వివరించరు. అమెరికా గొప్పతనం పోవటం ట్రంప్ 'మాగా' నినాదం ఇచ్చిన 2017 నాటికే మొదలైంది. అందుకు కారణాలు పైన పేర్కొన్నవే. ఆ కారణాలు 2017 కన్న ఇప్పటికి గత ఏడేళ్లలో మరింత తీవ్రమయ్యాయి. వర్తమాన పరిస్థితులను బట్టి చూడగా మునుముందు ఇట్లానే తీవ్రమవుతూ పోగలవని చెప్పటం కష్టం కాదు. ఈ అంచనాలు ఆందోళన కలిగించటం వల్లనే ట్రంప్ బృందం పై డాక్యువెంట్‌ను రూపొందించిందనాలి.మరి గొప్పతనాన్ని తిరిగి సాధించటం ఎట్లాగన్నది చివరి ప్రశ్న. ఆ వ్యూహాన్ని అమలు పరచటం ఈ డాక్యుమెంట్‌తో నిమిత్తం లేకుండానే ట్రంప్ ఈ రెండవ సారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే అమలు పరుస్తున్నారు కూడా. ఇక యుద్ధాలు చేయకపోవటం, ఇతరుల యుద్ధాలు కూడా మాన్పించటం, బయటి వారిని పంపివేయటం, కొత్తవారిని రానివ్వకపోవటం, బయటి దేశాల పెట్టుబడులను, కంపెనీలను ఆకర్షించటం, బయటకు పోయిన అమెరికన్ కంపెనీలను తిరిగి రప్పించటం, పేద దేశాలకే గాక అమెరికన్ కూటమి దేశాలకు సైతం ఉచిత సహాయాలు ఆపటం, అక్కర లేదనుకునే ఉద్యోగాల రద్దు, అన్ని దేశాలపై విపరీతంగా సుంకాల పెంపు, తమ ఉత్పత్తులు కొని తీరాలని ఇతరులపై ఒత్తిడి వంటివన్నీ ఇందులోకి వస్తాయి. ఇటువంటి చర్యల వల్ల ట్రంప్ లక్షాలు నిజంగా నెరవేరుతాయా అనే దానిపై అమెరికన్ నిపుణులలోనే సందేహాలు న్నాయి.కనుక, చివరకు ఫలితాలు ఏ విధంగా ఉండవచ్చునో ఇంకా స్పష్టత లేకపోయినా, అదే 'మాగా' లో భాగంగా ఇప్పుడు ప్రకటించిన కొత్త డాక్యుమెంట్ నిజానికి స్వభావ రీత్యా కొత్తదేమీ కాదు. కాని అందులోని తీవ్రతలు, స్పష్టతలు కొత్తవి. ఇటువంటి తీవ్రతలే అమెరికా మిత్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఉదాహరణకు ఆ డాక్యుమెంట్‌లోని కొన్ని అంశాలను చూద్దాం. ఉక్రెయిన్ యుద్ధం వల్ల అమెరికాకు ఆర్థిక, సైనిక భారాలే తప్ప ప్రయోజనం లేదనుకున్న ట్రంప్ దానిని ఆపే ప్రయత్నాలు మొదటి నుంచి చూస్తూ రాగా, అందుకు కలిసి రాని ఉక్రెయిన్, యూరప్‌లపై ఇప్పుడు తుది హెచ్చరికలనదగ్గవి జారీ చేస్తున్నారు. ముఖ్యంగా యూరప్ గురించి అయితే, అసలు వారి విధానాల కారణంగా యూరోపియన్ సంస్కృతి, వ్యక్తిత్వం, శక్తి ప్రపత్తులు, స్వాతంత్ర్యం అన్నవే క్రమంగా అంతర్ధానమయ్యే పరిస్థితులున్నాయని హెచ్చరిస్తున్నారు. అవి నిలిచి ఉండడం కోసమంటూ అక్కడి తమ తరహా మితవాద పార్టీలను బాహాటంగా సమర్థిస్తున్నారు. అనగా తమ వలెనే అందరూ తక్కిన ప్రపంచంతో సంబంధాలను తగ్గించుకుని ఎవరికి వారుగా వ్యవహరించటమన్న మాట. ఇంత కాలం వలె మొత్తం యూరోపియన్ దేశాలన్నీ ఒక యూనియన్‌గా కొనసాగటం కూడా వృథా అన్నది ఈ డాక్యుమెంటు సూచన. దీనితో అక్కడి మితవాద పార్టీలలోనూ కొన్ని ఏకీభవించటం లేదన్నది, యూరప్‌కు సహజ సంప్రదాయమనుకునే ఉదారవాద ప్రజాస్వామిక విలువలను వదులుకోవటం వారికి ఇష్టం లేదన్నది వేరే విషయం.

# చర్చలా! విద్వేష రచ్చలా!



న్యూఢిల్లీ,పార్లమెంట్ అన్నది ప్రజాసమస్యలపై విస్తృతంగా చర్చించవలసిన వేదిక. అంతేకాదు ఆ మేరకు పాలనా విధానాలపై మార్గదర్శకాలు రూపొందించేలా ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయాల్సిన బాధ్యతాపరమైన చక్కని అవకాశం. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం నుంచి జాతీయ గేయం వందేమాతరం, ఎన్నికల సంస్కరణలు అనే రెండు ముఖ్యమైన అంశాలపై చర్చిస్తున్నాయి. వాడిగా, వేడిగా సాగిన ఈ చర్చలు ఎంతవరకు నిజంగా ఫలప్రదమవుతున్నాయన్నది ప్రశ్నార్థకమే. ఉదాహరణకు జాతీయ గేయం వందేమాతరంపై చర్చలో కొంతవరకు చారిత్రక, చట్టబద్ధమైన ప్రస్తావనలు తెరపైకి తీసుకువచ్చి తమ వాదన వినిపించడంలో విపక్షం విజయం సాధించిందనే చెప్పవచ్చు. కానీ పాలక పక్షం అడ్డగోలు వాదనలతో పూర్వ జాతీయ కాంగ్రెస్ నాయకులపై బద్ధ శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోంది. వారికి నెహ్రూ ఫోబియా వెంటాడుతున్నట్టు కనిపిస్తోంది. ఇక ఎన్నికల సంస్కరణలపై చర్చ విషయానికి వస్తే ఇదివరకటి ఆరోపణల డ్రామాగానే దారితీసింది. ప్రజాతీర్పును హైజాక్ చేయడానికి ఎన్నికల కమిషన్ స్వతంత్రతను ప్రభుత్వం తన ప్రయోజనాల కోసం బలహీనపర్చి దుర్వినియోగం చేస్తోందని విపక్షాలు దుమ్మెత్తిపోశాయి. ఈ విమర్శలను పాలక వర్గం కొట్టి పారేస్తూ అక్రమ చొరబాటుదార్లను, అనర్హులైన ఓటర్లను ఏరివేయడానికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) దేశమంతా నిర్వహిస్తున్నట్టు సమాధానం ఇచ్చింది.అక్రమ వలసదారులను ఓటర్ల జాబితాల్లోంచి తొలగిస్తే ఎన్నికల్లో తమకు నష్టం వస్తుందన్న భయంతో విపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ఈ చట్టబద్ధమైన ప్రక్రియకు లేనిపోని అభ్యంతరాలు తెలుపుతోందని కేంద్రమంత్రి అమిత్ షా ఆరోపించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లపై సందేహాలు వ్యక్తం చేస్తుంటారని, గెలిచినప్పుడు ఈ ప్రస్తావనే తీసుకురాకపోవడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని చాటుతుందని అమిత్ షా ఎద్దేవా చేశారు. ఈ ఆరోపణలను కాంగ్రెస్ ఖండించలేకపోయింది. ఏదెలాగున్నా అక్రమ వలసదారులను భారత ప్రజాస్వామ్య వ్యవస్థ నుంచి బయటకు పంపడమే ఎస్ఐఆర్ లక్షమని అమిత్ షా వాదించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అక్రమ వలసదారుల విషయంలో తన నిఘా (డిటెక్ట్), తొలగింపు (డిలీట్), బహిష్కరణ (డిపోర్టు) విధానాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగ పరమైన వివాదానికి దారితీస్తోంది. వాస్తవానికి ఓటర్ల జాబితాను క్రమబద్ధీకరించడమే ఎస్ఐఆర్ విధి. చనిపోయిన ఓటర్లను జాబితానుంచి తొలగించడం, డూప్లికేట్ ఐడికార్డులను తొలగించడం, వలసదారులైన ఓటర్ల సమస్యను పరిష్కరించడం మాత్రమే చేయాలని ఎస్ఐర్‌పై పిటిషన్ల విచారణలో సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అంతేతప్ప ఓటరు పౌరసత్వం నిర్ణయించే హక్కు ఎన్నికల కమిషన్‌కు లేదు. కానీ అమిత్ షా ఓటరు జాబితాలో ఎవరి పేర్లు ఉండవో వారు బహిష్కృతులవుతారని తన సహజ ధోరిణిలో చెప్పడం వివాదాస్పదమవుతోంది. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ ప్రక్రియను ఎస్ఐఆర్‌లో చొప్పించడమేమిటని విపక్షాలు నిలదీస్తున్నాయి. అంతేకాదు ఎస్ఐఆర్ పారదర్శకతను ప్రశ్నిస్తున్నాయి. ఇక చీఫ్ ఎలెక్షన్ కమిషనర్‌ను ఎంపిక చేసే ప్యానెల్ నుంచి చీఫ్ జస్టిస్‌ను ఎందుకు తొలగించారన్న ప్రశ్న విపక్షాల నుంచి రాగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎవరినీ సంప్రదించకుండా ఈ ఎంపిక ప్రత్యేకంగా జరిగిందని అమిత్ షా ఉదాహరణ చూపించారు. ప్రధాన మంత్రి, కేబినెట్ మంత్రి, విపక్ష నాయకుడుతో ఉన్న ప్రస్తుత ప్యానెల్ ఎంపికలో తేడా ఏమొచ్చిందని కూడా ప్రశ్నించారు. కొత్త చట్టంలో సిఇసి, ఇసిల మధ్య సమానత్వాన్ని తీసివేసి, ఇసిలను తొలగించే అధికారం సిఇసికి ఎలా కల్పించారు? అన్న ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సమాధానం రాలేదు. ఇలా చేయడం నిజంగా ఎన్నికల నిర్వహణ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీయడమే అవుతుంది.విపక్ష నాయకుడు ఓటు చోరీ జరిగిందని అంటూ కొన్ని అవకతవకలు బయటపెట్టారు. వీటికి ఎన్నికల కమిషన్ కానీ, పార్లమెంట్ చర్చల్లో ప్రభుత్వం కానీ వివరణ ఇవ్వకుండా మొఖం చాటేయడమే జరిగింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలపై అధికార పక్షం వేలెత్తి చూపించినప్పుడు సరైన నిర్మాణాత్మక వాస్తవాలు కనిపించాలి తప్ప 'గతంలో మీరేం చేశారు?' అని ఎదురు ప్రశ్న సరైన విధానం కాదు. అలాగే అధికార, ప్రతిపక్షవర్గాలు ఇంతవరకు ఉభయత్రా జరిగిన పొరపాట్లను గుర్తించి అవి మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకునే మార్గాలేమిటో అన్వేషించాలి. ఎన్నికల నిర్వహణ యంత్రాంగాన్ని జవాబుదారీగా, పారదర్శకంగా బలోపేతం చేయాలి. కానీ ఈ విషయంలో పాలకవర్గాలకు సరైన శ్రద్ధ ఉన్నట్టు తోచడం లేదు. విపక్షాల వాదనలను చిత్తు చేయడానికే పార్లమెంట్ సమావేశాలను వినియోగించుకుంటున్నారు. ద్వేష ప్రసంగాలతో కత్తులు దూసుకుంటున్నారు. స్వాతంత్ర్య పోరా టం కులమత వర్గాలకు అతీతంగా సమైక్య స్ఫూర్తితో ఎలా సాగిందో అందరికీ తెలిసిందే. బ్రిటిష్ ప్రభుత్వ విభజించు పాలించు పన్నాగాలను చీల్చిచెండాడేలా కులమతవర్గాలకు అతీతంగా సమైక్య స్ఫూరితో స్వాతంత్ర్య పోరాటం ఎలా సాగిందో ఎవరికీ తెలియనిది కాదు. కానీ నేడు చారిత్రక వాస్తవాలను పక్కదారి పట్టించి విభజించు పాలించు విధానంతోనే ఓట్ల బ్యాంకు కొల్లగొట్టడానికి బూటకపు ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తుండడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు తీరని కళంకం. పార్లమెంట్ కార్యకలాపాలకు నిమిషానికి రూ. 2.5 లక్షల వరకు ఖర్చవుతుందని గణాంకాలు చెబుతున్నాయి. కానీ మన ప్రజా ప్రతినిధులు వృథ ప్రసంగాలతోనే కాలం గడిపితే ఎంత దుర్వినియోగం అవుతుందో ఆత్మపరీక్ష చేసుకోవడం మంచిది.

## వేర్వేరు చోట్ల ఫుడ్ పాయిజనింగ్

హైదరాబాద్,హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం రాత్రి పాడైపోయిన పెరుగును ఆహారంలో ఇవ్వడంతో 22 మంది చిన్నారులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అలాగే మాదాపూర్ పరిధిలోని చంద్రానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో కలుషితమైన పాయసం తిని 44 మంది విద్యార్థులు దవాఖాన పాలయ్యారు. అన్ని వసతులూ అందుబాటులో ఉండాల్సిన మహానగరంలోనే ఒకేరోజు 66 మంది విద్యార్థులు కలుషితాహారం బారినపడ్డారు. విద్యార్థులకు కింగ్‌కోఠి, నిలోఫర్, కొండాపూర్ దవాఖానలు, రెయిన్‌బో హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. బాగ్‌లింగంపల్లి మైనారిటీ గురుకులంలో 337 మంది విద్యార్థినులు చదువుతున్నారు. గురువారం రాత్రి భోజనం తిన్నతర్వాత తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. వారిని అంబులెన్స్‌లో కింగ్‌కోఠి, నిలోఫర్ దవాఖానలకు తరలించారు. పాడైన పెరుగు తినడం వల్లే అస్వస్థతకు గురైనట్టు విద్యార్థినులు తెలిపారు. ఘటన గురించి తెలిసి తల్లిదండ్రులు గురుకుల పాఠశాల వద్దకు, దవాఖానల వద్దకు చేరుకొని ఆందోళన వ్యక్తంచేశారు.చంద్రానాయక్ తండా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కలుషితం కావడంతో 44 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం తిన్న తనవాత 44 మంది అస్వస్థతకు గురయ్యారు. ఉపాధ్యాయులు అంబులెన్స్ ద్వారా 38 మందిని కొండాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో నానక్‌రాంగూడలోని రెయిన్‌బో దవాఖానకు తరలించి చికిత్స అందించారు. మధ్యాహ్న భోజనంలో పాడైన పాయసం తినడం వల్లనే అస్వస్థతకు గురైనట్టు తెలుస్తున్నది. 44 మందికి విద్యార్థులు అస్వస్థతకు గురైనా ఉపాధ్యాయులు తమకు సమాచారం ఇవ్వలేదని తల్లిదండ్రులు చెప్తున్నారు. సాయంత్రమైనా తమ పిల్లలు ఇంటికి రాకపోవడంతో 5 గంటలకు తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. అప్పుడు ఫుడ్ పాయిజన్ అయిందని, దవాఖానకు తరలించినట్లు తెలిపారని వాపోయారు. తమ పిల్లలు అస్వస్థతకు గురైనా సమాచారం ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

## హాస్టల్ విద్యార్థులకు పట్టెడన్నం పెట్టలేరా?

హైదరాబాద్,రేవంత్ రెడ్డి పిల్లల పాలిట 'పాయిజన్ 2047'గా మారాడని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పేద పిల్లల మీద ముఖ్యమంత్రి పగబట్టాడు. రెండేండ్లలో 116 మంది పిల్లలను పొట్టన పెట్టుకున్నాడని చెప్పారు. ఇంతమంది విద్యార్థులు చనిపోతున్నా రేవంత్ రెడ్డికి కనీసం చీమకుట్టినట్లయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ రెండేండ్ల పాలనలో స్కూలు విద్యార్థులకు కనీసం పట్టెడన్నం పెట్టలేక పోతున్నావని మండిపడ్డారు. విద్యాశాఖమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ అట్టర్ ఫ్లాప్ అయ్యాడని దుయ్యబట్టారు. ఫుడ్ పాయిజన్ బారిన పడి హైదరాబాద్ కింగ్ కోఠి దవాఖానలో చికిత్స పొందుతున్న బాగ్ లింగంపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్ కలిసి హరీశ్ రావు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని హాస్పిటల్ పాలవుతున్నారు. మొన్న షామీర్‌పేట బీసీ గురుకుల పాఠశాలలో అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఏకంగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లే పరిస్థితి వచ్చింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విద్యార్థులే ఫిర్యాదు చేశారు. నిన్న మాదాపూర్‌లోని చందునాయక్ తండాలో మధ్యాహ్న భోజనం వికటించి 43 మంది పిల్లలు దవాఖానలో చేరారు. ఇప్పుడు ముషీరాబాద్ నియోజకవర్గంలో బాగ్ లింగంపల్లి మైనార్టీ గురుకులంలో కలుషిత ఆహారం తిని 90 మంది ఆసుపత్రి పాలయ్యారు. రేవంత్ రెడ్డి విజన్ 2047 అని డబ్బా కొట్టుకుంటున్నాడు. ఇది విజన్ 2047 కాదు.. విద్యార్థుల పాలిట పాయిజన్ 2047గా మారింది. రేవంత్ రెడ్డి పిల్లల పాలిట పాయిజన్ 2047గా మారిండు. నీకు నిజాయితీ ఉంటే గురుకులాల్లోని పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టు. ఆసుపత్రిలో చేరిన విద్యార్థులు తిరిగి మళ్లీ హాస్టల్‌కి వెళ్ళము అని భయపడి చెబుతున్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. కేసీఆర్ హయాంలో సన్నబియ్యంతో మంచి నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందేది. ఇప్పుడు దొడ్డు బియ్యం పెడుతున్నారు, అన్నం ఉడకడం లేదు, సరైన భోజనం పెట్టట్లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌బాల్ ఆడడంలో ముఖ్యమంత్రి బిజీగా ఉంటాడు. మెస్సితో ఫుట్‌బాల్ ఆడటానికి మేస్త్రి కోట్లు ఖర్చు చేస్తున్నాడు.ఈరోజు రాష్ట్రంలో దాదాపు 300 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే రాహుల్ గాంధీ రాడు. 160 మంది ఆటో డ్రైవర్లు చనిపోతే రాడు. 116 మంది విద్యార్థులు చనిపోతే రాడు. 42 శాతం రిజర్వేషన్ కోసం బీసీలు పోరాటం చేస్తున్నా రాడు. రాష్ట్రంలో ఎన్ని సమస్యలు ఉన్నా ముఖం చాటేసి, ఈరోజు ఫుట్‌బాల్ మ్యాచ్ చూడటానికి వస్తున్నాడు. రాహుల్ గాంధీ ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వచ్చి రేవంత్ రెడ్డి ఆడే ఫుట్‌బాల్ మ్యాచ్ చూసి పరవశిస్తాడంట. కలుషిత ఆహారంతో కడుపునొప్పి భరించలేక ఏడుస్తున్న విద్యార్థుల కన్నీళ్లు చూడు రాహుల్ గాంధీ అని హరీష్ ఎద్దేవా చేశారు.
విద్యార్థులకు పాడైన భోజనం పెట్టి వారి ప్రాణాలతో చెలగాటమాడుతారా? అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మండిపడ్డారు. బాగ్‌లింగంపల్లి మైనారిటీ గురుకులంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై ఆయన స్పందిస్తూ విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో నిర్లక్ష్యం తగదని సూచించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి సకల వసతులు కల్పించిందని గుర్తుచేశారు. 2016లో బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకులాన్ని ఏర్పాటు చేయగా బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. నాడు విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి ఆహారం అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను, విద్యార్థులను పట్టించుకోకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతున్నాయని మండిపడ్డారు.

## రోజా తీరుపై టిడిపి నగరి నేతల ఆగ్రహం

తిరుపతి,మాజీ మంత్రి రోజాపై టీడీపీ నగరి నేతలు నిప్పులు చెరిగారు. నగరిలో తాము పెట్టిన భిక్షే రోజా రాజకీయ జీవితమన్నారు. ఇక జీవితంలో రోజా నగరిలో గెలవలేదని స్పష్టం చేశారు. తాము పార్టీ మారడానికి రోజానే కారణమని ఆగ్రహంచెందారు. రోజా ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతోం దంటూ టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం నాడు.. మాజీ శ్రీశైలం బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, విజయపురం ఎంపీపీ లక్ష్మీపతిరాజు, నింద్ర ఎంపీపీ భాస్కర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రోజాపై విమర్శలు గుప్పించారు. నగరిలో తాము పెట్టిన భిక్షే రోజా రాజకీయ జీవితమని మాజీ శ్రీశైలం బోర్డు చైర్మన్ చక్రపాణి రెడ్డి అన్నారు. ఎంపీపీ ఎన్నికలు న్యాయబద్ధంగానే జరిగాయన్నారు. ఓ అబ్బకు పుట్టావా అంటూ రోజా మాట్లాడటం బాధాకరమన్నారు.

# బాలినేనికి ఎమ్మెల్సీ.. ఏం జరిగింది ..!



ఒంగోలు,సీనియర్ పొలిటీషియన్ ఒంగోలు మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం జనసేనలో ఉన్నారు. అయితే ఆయనకు పెద్దగా ప్రాధాన్యం అయితే లభించడం లేదు. గత ఎన్నికలకు ముందు వైసీపీ తరఫున పోటీ చేసిన బాలినేని శ్రీనివాస్ రెడ్డి అనంతరం ఆ పార్టీతో విభేదించి బయటకు వచ్చారు. జనసేన కండువా కప్పుకున్నారు. కానీ బాలినేని పై ఇటు జనసేన అటు టిడిపి నాయకుల్లో కూడా తీవ్రమైన వ్యతిరేకత కొనసాగుతోంది. దీనిని తగ్గించేందుకు బాలినేని ప్రయత్నం చేస్తున్నారు.అయినప్పటికీ కొందరు నాయకులు ఆయనపై వ్యతిరేక ప్రచారం అదేవిధంగా పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటివి తరచుగా చర్చకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో భేటీ అయ్యారు. పార్టీలో తనకు ప్రాధాన్యం పెంచడం తో పాటుగా... ఎమ్మెల్సీ పదవిపై కూడా ఆయన చర్చించినట్లు తెలిసింది. వాస్తవానికి గతంలోనే బాలినేనికి ఎమ్మెల్సీ ఆఫర్ చేశారన్న వాదన తెరమీదకు వచ్చినప్పుడు ఆయన వద్దన్నట్టుగా వార్తలు వచ్చాయి.తన స్థాయికి తగదని ఆయన వ్యాఖ్యానించినట్టు జనసేన వర్గాలు కూడా చెప్పాయి. కానీ, ఇప్పుడు పదవి లేకపోవడంతో తనకు ఎలాంటి ప్రాధాన్యం లభించడం లేదని, పార్టీలోనూ అదేవిధంగా వ్యక్తిగతంగా కూడా తనకు ఇబ్బందికర పరిస్తితులు ఏర్పడుతున్నాయని బాలినేని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పవను కలిసిన ఆయన ఎంఎల్సీ పదవి ఇవ్వాలని కోరినట్టు ప్రచారం తెర మీదకు వచ్చింది. కానీ, ఇప్పుడున్న పరిస్థితులో ఎమ్మెల్సీ పోస్ట్ కోసం చాలామంది లైన్ లో ఉన్నారు.అయితే జనసేన తరఫున బాలినేనికి ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికిప్పుడు ఎమ్మెల్సీ పదవులు కూడా ఖాళీ లేకపోవడం వచ్చే ఎన్నికల వరకు ఆగడం లేదా ఇటీవల రాజీనామా చేసిన వైసీపీ ఎమ్మెల్సీల సీట్లు ఖాళీ అయితే వాటిలో ఒకటి బాలినేనికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏదేమైనా బాలినేనికి ఎమ్మెల్సీ ఇచ్చే విషయం జనసేనలో హాట్ టాపిక్ గా మారింది. మరి ఇది జరుగుతుందా లేదా అనేది చూడాలి.ఎదకు వచ్చింది. కానీ, ఇప్పుడున్న పరిస్థితులో ఎమ్మెల్సీ పోస్ట్ కోసం చాలామంది లైన్ లో ఉన్నారు.అయితే జనసేన తరఫున బాలినేనికి ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికిప్పుడు ఎమ్మెల్సీ పదవులు కూడా ఖాళీ లేకపోవడం వచ్చే ఎన్నికల వరకు ఆగడం లేదా ఇటీవల రాజీనామా చేసిన వైసీపీ ఎమ్మెల్సీల సీట్లు ఖాళీ అయితే వాటిలో ఒకటి బాలినేనికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏదేమైనా బాలినేనికి ఎమ్మెల్సీ ఇచ్చే విషయం జనసేనలో హాట్ టాపిక్ గా మారింది. ఇది జరుగుతుందా లేదా అనేది చూడాలి.

# ఆ ఓటు బ్యాంకుపై బీజేపీ దృష్టి ..!

అమరావతి,ఏపీలో బీజేపీ పుంజుకోవాలి. బలమైన శక్తిగా కూడా ఎదగాలి. - ఇదీ.. జాతీయ బీజేపీ నాయకత్వం పెట్టుకు న్న లక్ష్యం. ఈ లక్ష్య సాధన కోసం ఇప్పటి వరకు అనేక ప్రయత్నాలు సాగాయి. కాపు సామాజిక వర్గాన్ని తనవైపు తిప్పుకొనేందుకు సోము వీర్రాజు, కన్నా లక్ష్మీనారాయణ వంటివారికి రాష్ట్ర పార్టీ బాధ్యతలు అప్ప గించారు. కానీ.. అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. ఇక, ఆ తర్వాత కమ్మ సామాజిక వర్గంతో కలుపుగోలు కోసం పురందేశ్వరికి కూడా పగ్గాలు అప్పగించారు.కూటమి కట్టడంలోనూ.. గత ఎన్నికల్లో విజయం దక్కించుకునే విషయంలోనూ ఆమెసక్సెస్ అయ్యారు. అయితే.. ఇది చాలదన్నది పార్టీ జాతీయ నాయకత్వం చెబుతున్నమాట. ఈ క్రమంలోనే ప్రత్యేక దృష్టి పెట్టారు. కూటమిలో కలివిడిగా ఉంటూనే వ్యక్తిగతంగా పార్టీని డెవలప్ చేయాలని భావిస్తున్నారు. తాజాగా ఇదే విషయంపై రాష్ట్ర నాయకత్వం కూడా కసరత్తును ముమ్మరం చేసింది. ఈ క్రమంలో తటస్థ ఓటు బ్యాంకును చేరువ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది.ప్రస్తుతం కులాలు, సామాజిక వర్గాల ఆధారంగా ఓటు బ్యాంకు కొన్ని పార్టీలకు పరిమితం అయింది. వైసీ పీకి రెడ్డి ఓటు బ్యాంకు.. పదిలం అనుకున్నా.. కొంత గ్యాప్ వచ్చింది. ఈ గ్యాప్‌ను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఇక, ఎస్సీ ఓటు బ్యాంకు కూడా వైసీపీకి అనుకూలంగా ఉంది. భారీ కూటమి హవాలోనూ ఎస్సీనియోజకవర్గాల్లో వైసీపీ పట్టు సాధించింది. గెలిచినా గెలవకపోయి నా..



మెజారిటీ ఓట్లను దక్కించుకుంది.ఇక, ఎస్టీ ఓటు బ్యాంకు కూడా ఆ పార్టీకి అనుకూలంగానే ఉంది. ఈ నేపథ్యంలో మధ్యే మార్గంగా తటస్థ ఓటు బ్యాంకును సొంతం చేసుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీనిలో విద్యా వం తులు, మేధావులు...విద్యార్థి ఓటు బ్యాంకుపై దృష్టి పెడుతోంది. ఇది ఏ పార్టీకి ఇబ్బంది కరంగా మారుతుందనే చర్చ తెరమీదికి వస్తోంది. కూటమికూడా కొంత మేరకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నా.. మెజారిటీగా వైసీపీ ఓటు బ్యాంకుకు పెద్ద ఎత్తున నష్టం వచ్చే ఛాన్స్ కనిపిస్తోందని చెబుతున్నారు. అదేసమయంలో బీజేపీకి బలమైన ఓటు బ్యాంకు ఏర్పడుతుందా? అంటే.. ఇప్పటికిప్పుడు చెప్పే పరిస్థితి కూడా కనిపించడం లేదు.

# బీజేపీ విజయానికి కాంగ్రెస్ నేత సంబరాలు!



కేరళ:కేరళ రాష్ట్రంలో తొలిసారి బీజేపీ విజయం దక్కించుకుంది. కేరళలోని రాజధాని నగరం తిరువనంతపురంలో తాజాగా జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ 50 స్థానాలు దక్కించుకుని అతి పెద్దపార్టీగా అవతరించింది. దాదాపు 45 ఏళ్ల తర్వాత.. బీజేపీ విజయం దక్కించుకోవడం ఒక ఎత్తు అయితే.. ఇక్కడి బలమైన కమ్యూనిస్టు కోటలను బద్దలు కొట్టి కమల వికాసం జరగడం మరో ఎత్తు. దీంతో బీజేపీనాయకులు సంబరాలు చేసుకున్నారు. అయితే.. ఇదేసమయంలో కాంగ్రెస్ పార్టీ ఇక్కడ మళ్లీ పల్టీలు కొట్టింది. ఉన్న స్థానాలను కూడా కోల్పోయింది. దీంతో ఆ పార్టీ సహజంగానే బాధలో ఉంటుంది.కానీ.. ఇదే కాంగ్రెస్ పార్టీకి చెందిన తిరువనంతపురం పార్లమెంటు సభ్యుడు శశిథరూర్ మాత్రం బీజేపీకిశుభాకాంక్షలు చెప్పారు. 100 కిలోల స్వీట్లను బీజేపీ కార్యాలయాలకు పంపిస్తున్నట్టు ప్రకటించారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి పుండుమీద కారం చల్లినట్టు అయింది. తిరువనంతపురం కార్పొరేషన్ పరిధిలో 101 కార్పొరేటర్ వార్డులు ఉన్నాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ 50, అధికార కమ్యూనిస్టు పార్టీ సీపీఐ నేతృత్వంలో ఎల్‌డీఎఫ్ కూటమి 29, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 19 వార్డులను దక్కించుకున్నాయి. మరో 3 ఇతరులు విజయం సాధించారు.

ఈ పరిణామాలు.. బీజేపీలో భారీ ఆనందాన్ని నింపాయి. వచ్చే ఏడాది కేరళలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన ఈ కార్పొరేషన్ ఎన్నికలను బీజేపీ తమకు సానుకూల సంకేతంగా భావిస్తోంది. వాస్తవానికి గత 2024 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఒకే ఒక్క పార్లమెంటు స్థానంలో విజయం దక్కించుకుంది. అలాంటిది స్వల్ప కాలంలోనే పుంజుకుని కార్పొరేషన్‌లో విజయం సాధించింది. ఈ విజయంపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. 45 ఏళ్ల అరాచకాలను ప్రజలు సహించలేకే తమవైపు మొగ్గు చూపారని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ ప్రజలకు మంచి రోజులు వస్తున్నాయని వ్యాఖ్యానించారు.ఇక, దీనికి ముక్తాయింపుగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. బీజేపీ విజయాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఆయన కూడా 45 ఏళ్ల అరాచక పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పుగా ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజలు మార్పు దిశగా అడుగులు వేస్తున్నారని చెప్పడానికి ఇది ఉదాహరణ అని తెలిపారు. “అధికార పక్షం చేస్తున్న అక్రమాలను చాలా సార్లు ప్రశ్నించాను. అయినా.. వారిలో మార్పు కనిపించలేదు. ఇప్పుడు ప్రజలే మారారు“ అని థరూర్ వ్యాఖ్యానించారు. ఈసందర్భాన్ని పురస్కరించుకుని 100 కేజీల మిఠాయిలు పంపనున్నట్టు తెలిపారు.

# ఛాన్స్ కోసం -చెల్లెళ్ల- వెయిటింగ్.. !

న్యూఢిల్లీ,వైసీపీని గత ఎన్నికల్లో దెబ్బతీసిన అనేక కారణాల్లో జగన్ సోదరీమణులు కీలక పాత్ర పోషించారు. తోడ బుట్టిన షర్మిలతోపాటు.. బాబాయి కుమార్తె సునీతలు ఇద్దరూ.. గత ఎన్నికల సమయంలో ఊరూ వాడా తిరిగి జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. దీనికి తోడు.. కూటమి పార్టీలు కూడా.. ప్రచార పర్వంలో ముందుకు సాగాయి. ఫలితంగా సొంతగా చేసుకున్న పనులతోపాటు.. ఈ వ్యతిరేక ప్రచారం దోహదపడి వైసీపీ పతనానికి దారి తీసింది. మరీముఖ్యంగా ఇద్దరు చెల్లెళ్ల ప్రచారం పార్టీకి శరాఘాతంగా పనిచేసింది.అయితే.. అక్కడితో అయిపోయిందా? షర్మిల, సునీతలు ఇద్దరూ శాంతించారా? అంటే.. లేదనే చెబుతున్నారు పరిశీలకులు. వారిద్దరూ మళ్లీ ఛాన్స్ కోసం ఎదురు చూస్తున్నాం న్నది పరిశీలకులు, విశ్లేషకులు చెబుతున్న మాట. అయితే.. ఆ ఛాన్స్ ఎన్నికలేనా? అంటే.అవకాశం ఎప్పుడు వస్తే అప్పుడు విరుచుకు పడేందుకు ప్లాన్‌రెడీ చేసుకుంటున్నారని అంటున్నారు. ఇద్దరు సోదరీమణులు ఎదురు తిరగడానికి కారణమైన కీలక సమస్యలు అలానే ఉన్నాయి.అవి పరిష్కారం కానంత వరకు .. జగన్‌కు పక్కలో బల్లెం మాదిరిగా ఇద్దరు చెల్లెళ్లు.. కాచుకుని కూర్చుంటారని చెబుతున్నారు. ఆస్తుల వివాదం, రాజకీయ ఉన్నతి కోసం షర్మిల పాకులాడుతున్నారు. దీనిలో రాజకీయంగా ఆమె ఒక లైన్ తీసుకున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నారు. కానీ, ఇక్కడ కూడా.. జగన్ చక్రం తిప్పుతున్నారని.. కాంగ్రెస్ పార్టీలోని కొందరిని ఆయన మేనేజ్ చేస్తున్నారని.. ఫలితంగా తన గ్రాఫ్ పెరగడం లేదని షర్మిల భావిస్తున్నారు.



ఇక, ఆస్తుల వివాదం ఎటూ తేలడం లేదు.సునీత విషయానికి వస్తే.. ఏకైక అజెండా వివేకానందరెడ్డి దారుణ హత్య. ఈ కేసు ఎటూ తేలడం లేదు. మరో మూడేళ్లు పట్టినా అంటే.. వచ్చే ఎన్నికల నాటికి కూడా తేలుతుందా? అనేది ప్రశ్న. సో.. ఈ సమస్య తేలే వరకు.. సునీత డైరీలో ఉన్న వారికి శిక్షలు పడే వరకు ఆమె శాంతించేది లేదు. సో.. ఈ ఇద్దరు చెల్లెళ్లు కూడా.. అన్నపైన, అన్నరాజకీయాలపైనా.. ఓ కన్నేసి ఉంచారన్నది వాస్తవం. సో.. వీరి బెడద జగన్ కు తొలిగిపోలేదు. ఎప్పుడైనా .. ఎక్కడైనా వీరు విజృంభించే అవకాశం మెండుగానే కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు.

# కేటీఆర్ అఖిలేష్ ...వేరే ప్లాన్ ఉందా ?

హైదరాబాద్,తెలంగాణాలో పర్యటనకు వచ్చిన యూపీ మాజీ సీఎం, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో ఎక్కువగా గడుపుతున్నారు అని అంటున్నారు. ఆయన వచ్చీ రావడం తోనే కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డిని కలిసారు. ఇక ఆ తరువాత అంతా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తోనే గడుపుతూ వచ్చారు. ఆయనతో కలిసి ప్రెస్ మీట్ ని అటెండ్ చేశారు. కాలం ఒక్కలా ఉండదని చెబుతూ బీఆర్ఎస్ మళ్ళీ పవర్ లోకి వస్తుందని ఆశలు కల్పించారు. ఇక కేటీఆర్ సైతం అఖిలేష్ యాదవ్ ని పొగిడేశారు.

కలిసి భోజనం :

కట్ చేస్తే రెండవ రోజున కూడా ఈ ఇద్దరూ మంచి మిత్రులుగా మారిపోయారు. కలసి హైదరాబాద్ లోని రామేశ్వరం కేఫ్‌లో మధ్యాహ్న భోజనం చేయడం విశేషం. ఈ ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ హుషారుగా కనిపించారు. అలాగే భోజనం రుచులను ఒక వైపు ఆస్వాదిస్తూనే మరో వైపు వర్తమాన రాజకీయాల గురించి ఇద్దరూ చర్చించుకోవడం కనిపించింది. ఇదిలా ఉంటే కేఫ్ లో మంచి రుచికరమైన భోజనం లభించిందని అంతా బాగుందని అఖిలేష్ యాదవ్ కేఫ్ యజమానిని మెచ్చుకున్నారు. ఇక ఈ ఇద్దరు నేతలు కలిసి బీఆర్ఎస్ నాయకుడు తలసాని శ్రీనివాస యాదవ్ ఇంటికి కూడా వెళ్ళారు.

ఇండీ మిత్రుడుండగా :

ఇదిలా ఉంటే ఇండియా కూటమిలో బీఆర్ఎస్ అయితే లేదు, ఆ పార్టీ జాతీయ రాజకీయాలలో తటస్థంగా ఉంటోంది. ఇక కాంగ్రెస్ తెలంగాణ లో అధికారంలో ఉంది అంతే కాదు ఇండియా కూటమిలో కాంగ్రెస్ ఎస్పీ భుజం భుజం కలిపి పనిచేస్తున్నాయి. ఇంకో వైపు చూస్తే తెల్లారి లేస్తే కాంగ్రెస్ మీద విమర్శలు చేస్తూ బీఆర్ఎస్ విపక్ష రాజకీయం గట్టిగా చేస్తూ ఉంటుంది. అలాగే కాంగ్రెస్



ప్రభుత్వం సైతం బీఆర్ఎస్ ని ప్రతిపక్షంగా భావించి బలంగా టార్గెట్ చేస్తూంటుంది. అలాంటి రాజకీయ నేపథ్యం తెలంగాణ లో ఉంది.

స్థానిక వేడి ఉండగా :

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ని ఓడించాలని తాము గెలిచి తీరాలని బీఆర్ఎస్ చూస్తున్న పరిస్థితి ఉంది. అయితే ఈ కీలక సమయంలో ఇండియా కూటమి మిత్రుడుగా హైదరాబాద్ వచ్చిన ఎస్పీ ధినేత అఖిలేష్ యాదవ్ బీఆర్ఎస్ అగ్ర నేత కేటీఆర్ తో చెట్టాపట్టాలు వేసుకుని తిరగడం అయితే అందరికీ ఆశ్చర్యంగానే ఉంది అని అంటున్నారు. అయితే ఎస్పీ కాంగ్రెస్ యూపీలో మంచి మిత్రులు. అందువల్ల ఆ దోస్తీ అలాగే ఉంటుంది అని అంటున్నారు. ఇపుడు బీఆర్ఎ కొత్త చెలిమి మీదనే అంతా ఆలోచిస్తున్నారు. మరి ఇండీ కూటమిలోకి బీఆర్ఎస్ ని తీసుకుని రావాలని చూస్తున్నారా లేక ఎస్పీని తెలంగాణాలో విస్తరించే క్రమంలో బీఆర్ఎస్ ని మంచి మిత్రుడుగా చేసుకోవాలని ఆలోచిస్తున్నారా అన్నదే చర్చగా ఉంది.

# బీజేపీ-కాంగ్రెస్ డిష్యుం.. డిష్యుం.. ఎక్కడ? ఎందుకు?



హైదరాబాద్,కీలకమైన పంచాయతీ ఎన్నికల రెండో దశ పోలింగ్ (14/12) ప్రశాంతంగా మొదలైంది. తొలిదశ పూర్తి అయిన తర్వాత.. జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని రెండో దశ పోలింగ్‌కు అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో రెండో దశ పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభమైంది. అయితే.. మెదక్ జిల్లాలో మాత్రం కాంగ్రెస్-బీజేపీ మద్దతు దారులు బాహాబాహీకి దిగారు. ఎన్నికల పోలింగ్ బూతుల వద్ద ప్రచారం చేస్తున్నారని ఒకరిపై ఒకరు ఆరోపించుకున్నారు.ఎన్నికల అధికారులకు కూడా ఫిర్యాదులు చేశారు. ఇంతలోనే కాంగ్రెస్ నేతలు..మద్దతు దారులు బీజేపీ మద్దతు దారులపై దాడికి దిగారు. దీంతో ఇరు పక్షాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఒకరి పై ఒకరు దూషణలకు దిగడంతోపాటు.. పరస్పరం దాడులు చేసుకున్నారు. అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో అధికారులు పోలీసుల భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు.. దాడి చేసిన వారిని కొందరిని పోలీసులు అరెస్టు చేశారు.

ఇదీ రెండో దఫా పోరు రూపం!

- 193 మండలాల్లో రెండో దశ పోలింగ్ జరిగింది.
- మొత్తం 3వేల, 911 గ్రామ పంచాయతీ సర్పంచుల అదృష్టం తేలనుంది.
- అలాగే, 29వేల, 917 వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోనున్నారు.
- 911 సర్పంచ్ పదవులకు గాను 12,782 మంది పోటీలో ఉన్నారు.
- ఇక, 29 వేల, 917 వార్డు సభ్యుల పదవులకు గాను 71,071 మంది పోటీ చేశారు.

ఎక్కడికక్కడ కట్టుదిట్టం!

రెండో దశ ఎన్నికల పోలింగ్ విషయాన్ని బీఆర్ ఎస్, కాంగ్రెస్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. తొలి దశలో బీఆర్ ఎస్ వెనుకబడిన నేపథ్యంలో ఇప్పుడు పుంజుకునేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇంటింటి ప్రచారానికి సమయం ముగిసిన తర్వాత. కూడా కొందరు ప్రచారం చేయడం గమనార్హం. ఇక, కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులు కూడా ఇదే తరహాలో ప్రయత్నించారు. అయితే.. కొన్ని కొన్ని చోట్ల ఘర్షణలకు దారి తీసింది.

# వరంగల్ కాంగ్రెస్ 'తూర్పులో మార్పు' రాజకీయం!

హైదరాబాద్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో స్వంతపార్టీ కాంగ్రెస్‌లో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీలో నిన్నటి వరకు ఉన్న సమీకరణలు ఒక్కసారిగా మారిపోతున్నాయి. దీంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఒంటరైన మంత్రి కొండా సురేఖ దంపతులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సైతం ఒంటరిగా మారుతున్నారనే చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీలో ప్రారంభమైన ఈ మార్పు ప్రభావం వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాలపై ప్రభావం చూపుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. తూర్పులో పార్టీ లేదా ప్రభుత్వ కార్యక్రమాలుగానీ తాము చెప్పినట్లే సాగాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం తాము గీసిన గీత దాటొద్దంటూ 'పట్టు' బిగించేందుకు ప్రయత్నించిన కొండా దంపతులకు తమ అనుచరుల నుంచే వ్యతిరేకత ప్రారంభమైందన్న చర్చలు నడుస్తున్నాయి. ఈ వ్యతిరేకత నుంచే పార్టీలో సమీకరణలు మారుతున్నాయని జిల్లా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.మొన్నటి వరకు కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా సురేఖ వ్యతిరేక వర్గానికి చెందిన ఎర్రబెల్లి స్వర్ణ బాధ్యతలు నిర్వహించారు. కొండా దంపతులకు, స్వర్ణకు మధ్య ఉప్పునిప్పుగానే సాగింది. ఇటీవల నూతన డీసీసీ అధ్యక్షుల నియాకమంతో వరంగల్ తూర్పునకు చెందిన మైనార్టీ నాయకుడు అయూబ్ కు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించి కాంగ్రెస్ పార్టీ అందరినీ ఆశ్చర్చపరిచింది. అయూబ్‌కు వర్గ ముద్రలు లేకపోవడంతో కొండా దంపతులు నూతన అధ్యక్షుడితో సఖ్యతతో వ్యవహరిస్తారని అంతా భావించారు. అయూబ్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత్రి సోనియా జన్మదినోత్సవం పార్టీ అంతాకలిపి జరిపితే కొండా వర్గం నాయకులు దీనికి దూరంగా ఉన్నారు. ఆ వర్గం వేరే కార్యక్రమాన్ని నిర్వహించారు. తూర్పులో తమ విజయానికి కారణమైన మైనార్టీలకు ప్రతినిధిగా ఉన్న ఆయూబ్‌ను సైతం కొండా వర్గం పట్టించుకోకుండా అవమానించిందనే కొత్త చర్చకు దారితీసింది.

ఒంటరైన కొండా దంపతులు!

కొండా దంపతుల తీరుకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు వారికి మద్దతు తెలియజేసిన పార్టీ నాయకులతో పాటు, కొండా వ్యతిరేక వర్గం నాయకులు, అయూబ్ అనుకూలురంతా కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించి, కలిసి కట్టుగా సాగాలని నిర్ణయించడం ఇప్పుడు తూర్పులో హాట్ టాపిక్ గా మారింది. దీంతో ఒక్కసారిగా తూర్పు కాంగ్రెస్ రాజకీయాల్లో వేడిపెరిగింది. కొండ దంపతుల అనుచరుడిగా గుర్తింపు పొందిన నల్లగొండ రమేష్ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ నాయకులంతా సమావేశమై మంతనాలు జరపడం ఇప్పుడు అనూహ్యపరిణామంగా చెప్పవచ్చు. ఈ సమావేశానికి కొండా వ్యతిరేక వర్గ నాయకుడు ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య హాజరుకావడం సీరియస్ పరిణామంగా భావిస్తున్నారు. కొండా దంపతులు ఒకవైపు తూర్పు ముఖ్య నేతలు మరోవైపు అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. కొండా వర్గం తమకు కనీస న్యాయం చేయడంలేదనే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ పదవులతోపాటు, ఇప్పటి వరకు తూర్పునకు నామినేటెడ్ పదవులు రాని అంశం



చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకులంతా నూతన అధ్యక్షుడు అయూబ్, మాజీ మంత్రి సారయ్య నాయకత్వంలో పీసీసీ పెద్దలను, సీఎం రేవంత్ ను కలిసి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల గురించి విన్నవించాలని నిర్ణయించినట్లు సమాచారం.

జిల్లా కాంగ్రెస్ కమిటీ పై ప్రభావం

వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తూర్పు నియోజకవర్గానికి చెందిన మైనార్టీ ప్రతినిధి అయూబ్‌ను నియమించడంతో జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లా అధ్యక్షుడిగా అయూబ్‌కు మంత్రి మద్ధతునందించకపోవడంతో జిల్లాలోని మిగిలిన వర్ధన్నపేట, నర్సంపేటతోపాటు, తూర్పులోని కొండా వ్యతిరేక వర్గమంతా కలిసి కట్టుగా సాగేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో వరంగల్ జిల్లాలో కూడా అంతా ఒక వైపు, కొండా దంపతులు ఒక వైపు అన్నట్లుగా పరిణామాలు వేగంగా మారుతున్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

## విశాఖపట్టణం అభివృద్దిక పెద్దపీట...

విశాఖపట్టణం,విశాఖపట్నం అంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేకమైన అభిమానం ఉందని మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు. అలాగే వచ్చే నెలలో వైజాగ్ బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఈ ఫెస్టివల్ ద్వారా పర్యాటక రంగానికి ఊపునివ్వడంతో పాటు, విశాఖను అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఉత్తరాంధ్రను ఆర్థికంగా బలోపేతం చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని ఆయన అన్నారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ జిల్లా వరకు విస్తరించిన తొమ్మిది జిల్లాలను కలుపుకుని విశాఖ ఎకనామిక్ రీజియన్‌'ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఈ ఎకనామిక్ రీజియన్ ద్వారా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు చెప్పారు. నిన్న విశాఖ పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే నిర్వహించి, అభివృద్ధి అవకాశాలపై సమీక్ష చేశారని మంత్రి పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com